## విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189



# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET

MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 213 | volume: 1, Issue:213 | సోమవారం 02 మార్చి 2026 పేజీలు : 8 వెల : 3.00


## మదురైలో తి. పూర్ణచంద్రన్‌ను స్మరించిన ప్రధాని



**–డి.ఎం.కే ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శ....**

**–కుటుంబాన్ని పరామర్శించిన నరేంద్ర మోదీ....**

**మదురై:** ప్రధాని నరేంద్ర మోదీ మదురై పర్యటన సందర్భంగా తి. పూర్ణచంద్రన్‌ను స్మరించారు. ఈ ఘటన రాష్ట్రంలోని డి.ఎం.కే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఎవరెంత ప్రయత్నించినా సత్యం గెలుస్తుందని, భగవాన్ మురుగన్ భక్తులు విజయం సాధిస్తారని పేర్కొన్నారు. సందర్భంగా తి. పూర్ణచంద్రన్ కుటుంబాన్ని ప్రధాని పరామర్శించారు. ఆయన సతీమణి తిరుమతి ఇందుమతి, కుమారులను కలిసి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి బాధను పంచుకున్నారు. ప్రజల భావోద్వేగాలను గౌరవించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ప్రధాని సూచించారు. భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలు అంగీకారయోగ్యం కాదని వ్యాఖ్యానించారు. మదురై పర్యటనలో భాగంగా జరిగిన ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. భక్తుల హక్కులు, ఆధ్యాత్మిక స్వేచ్ఛ పరిరక్షణకు కేంద్రం కట్టుబడి ఉందని ప్రధాని తెలిపారు.

## రోడ్డు రవాణా శాఖపై తప్పుడు ప్రచారాలకు హెచ్చరిక



**–నియామక ప్రక్రియపై స్పష్టీకరణ ఇచ్చిన పొన్నం ప్రభాకర్...**

**–అర్హతలపై అపోహలు నమ్మొద్దని సూచన...**

**హైదరాబాద్:** రోడ్డు రవాణా శాఖపై తప్పుడు ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఆర్టీసీ నియామక ప్రక్రియపై జరుగుతున్న అపోహలకు ఆయన స్పష్టీకరణ ఇచ్చారు. ఆర్టీసీ నియామకాలకు ఆర్టీసీకి నేరుగా సంబంధం లేదని, ఈ నియామకాలు పోలీసు నియామక విభాగం పరిధిలో నిర్వహించబడుతున్నాయని తెలిపారు. డ్రైవర్ అర్హతల విషయంలో ఆరు అడుగుల ఎత్తు తప్పనిసరి అనే ప్రచారం పూర్తిగా తప్పని మంత్రి స్పష్టం చేశారు. డ్రైవర్ పదవికి కనీస ఎత్తు ఐదు అడుగులు మూడు అంగుళాలు లేదా 160 సెంటీమీటర్లు మాత్రమేనని వివరించారు. అభ్యర్థులు తప్పుడు సమాచారాన్ని నమ్మి అయోమయంలో పడవద్దని సూచించారు. టికెట్ అనువర్తనంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు లేవని మంత్రి తెలిపారు. సేవలు సజావుగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రయాణికులు నిర్భయంగా సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు.రోడ్డు రవాణా శాఖ ప్రతిష్ఠను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజలు అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని కోరారు.

## ఇరాన్ ఉన్నతాధికారుల మృతి



**టెహ్రాన్:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన వైమానిక దాడులు ఆ దేశానికి భారీ దెబ్బతీశాయి. ఈ దాడుల్లో ఇరాన్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అబ్దోల్లాహిం మౌసవి మరణించినట్లు ప్రభుత్వ మీడియా ఐఆర్ఐబీ వెల్లడించింది. టెహ్రాన్‌పై జరిగిన భీకర దాడుల్లో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ చీఫ్ కమాండర్ మొహమ్మద్ పాక్‌పూర్, రక్షణ మండలి కార్యదర్శి అలీ షంఖానీ, రక్షణ మంత్రి అజీజ్ నసిర్‌జాదే కూడా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. టెహ్రాన్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నతాధికారుల సమావేశాన్ని మిలిటరీ గూఢచారి విభాగం గుర్తించిన వెంటనే ఇజ్రాయెల్ వైమానిక దళం మెరుపు దాడులు నిర్వహించినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం ప్రకటించింది. ఈ ఆపరేషన్‌లో మొత్తం ఏడుగురు సీనియర్ కమాండర్లు హతమైనట్లు పేర్కొంది. మరికొంతమంది బాధితుల వివరాలు ఇంకా వెల్లడికావాల్సి ఉందని స్థానిక వర్గాలు చెబుతున్నాయి మరోవైపు ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మృతి చెందినట్లు ప్రభుత్వ టెలివిజన్ అధికారికంగా ధృవీకరించింది. తమ నాయకుడి మరణంపై ఐఆర్‌జీసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని స్పష్టం చేసింది. చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా అత్యంత భీకరమైన దాడులతో సమాధానం ఇస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అంతర్జాతీయ సమాజం పరిస్థితులను ఆందోళనతో గమనిస్తోంది.

## పదో తరగతి విద్యార్థులకు విజయీభవ సందేశం



**– సిద్దిపేటలో ప్రేరణ కార్యక్రమంలో హరీష్ రావు...**

**– మంచి మార్కులు సాధిస్తే ఐప్యాడ్ బహుమతి...**

**– లక్ష్యం సాధనకు ఏకాగ్రత, కృషి అవసరం...**

**సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించిన "విజయీభవ" ప్రేరణ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పది విద్యార్థులకు విజయీభవ అంటూ ఆశీర్వదించారు. పదో తరగతి జీవితాన్ని మార్చే మెట్టు అని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తేనే భవిష్యత్తు దిశ మారుతుందని తెలిపారు. మంచి మార్కులు సాధించిన వారికి ఐప్యాడ్ బహుమతిగా ఇస్తానని హామీ ఇచ్చారు. "మీ మైండ్‌లో విషయం ఉండటం మాత్రమే కాదు, మీ హ్యాండ్‌లో పవర్ ఉండాలి. అన్ని సబ్జెక్టులపై పట్టు ఉండటమే కాక, పరీక్ష పత్రంలో స్పష్టంగా రాస్తేనే మంచి ఫలితాలు వస్తాయి. చేతిరాత బాగుంటే తలరాత కూడా బాగుంటుంది" అని విద్యార్థులకు సూచించారు. చదువుతో పాటు వ్రాయడం కూడా సమానంగా ముఖ్యమని, ఏకాగ్రతతో చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రమంతటా బాసర త్రిపుల్ ఐటీ సీట్లు ఒక ఎత్తు అయితే, సిద్దిపేట విద్యార్థులకు వస్తున్న సీట్లు మరో ఎత్తు అని అన్నారు. సిద్దిపేట అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తోందని, ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లా మొదటి స్థానంలో నిలవాలని తన తపన అని తెలిపారు. నియోజకవర్గం నుంచి 2,875 మంది విద్యార్థులు ఈసారి పరీక్షలు రాయబోతున్నారని వెల్లడించారు. ప్రత్యేక తరగతులకు స్వంత ఖర్చుతో అల్పాహారం ఏర్పాటు చేశానని, తల్లిదండ్రులకు ఫోన్ చేసి టీవీలు ఆపించి పిల్లలను చదవమని కోరినట్లు తెలిపారు. ఇంట్లో చదువుకోడానికి డిజిటల్ పాఠ్యసామగ్రి అందించామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులే మెరుపులాంటి ప్రతిభావంతులని, ఆత్మవిశ్వాసంతో ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని పేర్కొన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అగ్ర ర్యాంకులు సాధించిన 30 మంది విద్యార్థులకు ఐప్యాడ్ బహుమతిగా ఇస్తానని ప్రకటించారు.

## దుకాణం శీతలపెట్టెలో యువకుడి మృతదేహం



**లక్నో:** ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నోలో దారుణ ఘటన వెలుగుచూసింది. మూసివేసిన ఒక శాకాహార బిర్యానీ దుకాణం శీతలపెట్టెలో యువకుడి మృతదేహం బయటపడటంతో స్థానికంగా కలకలం రేగింది. తన తండ్రి అంత్యక్రియల నిమిత్తం నాలుగు రోజుల క్రితం దుకాణాన్ని మూసివేసి వెళ్లిన యజమాని తిరిగి వచ్చి దుకాణం తెరిచినప్పుడు ఈ ఘటన బయటపడింది. దుకాణంలోని శీతలపెట్టెను తెరిచి చూడగా అందులో యువకుడి మృతదేహం కనిపించడంతో యజమాని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు వెల్లడించారు. మూసివేసిన దుకాణంలోకి మృతదేహం ఎలా చేరిందనే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుకాణ యజమానిని పోలీసులు విచారిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో అమర్చిన నిఘా కెమెరాల దృశ్యాలను సేకరించి పరిశీలిస్తున్నారు. యువకుడు ఎలా మరణించాడు, మృతదేహం అక్కడికి ఎలా వచ్చింది అనే విషయాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఘటన అనంతరం ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేసి నిఘాను మరింత పటిష్టం చేసినట్లు వెల్లడించారు.

## రైల్వే టెక్నీషియన్ పరీక్షలకు సిటీ సమాచార పత్రాలు విడుదల




**న్యూఢిల్లీ:** కేంద్ర రైల్వే శాఖ ఆధ్వర్యంలో వివిధ రైల్వే ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న టెక్నీషియన్ గ్రేడ్ ఒకటి, గ్రేడ్ మూడు పోస్టుల భర్తీకి సంబంధించి మరో ఐదు రోజుల్లో రాత పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులకు అవసరమైన సిటీ సమాచార పత్రాలను రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు తమ పరీక్ష నగరం వివరాలను ముందుగానే తెలుసుకునేందుకు ఈ సౌకర్యం కల్పించారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ నమోదు వివరాలు నమోదు చేసి సిటీ సమాచార పత్రాలను దిగుమతి చేసుకోవచ్చు. పరీక్ష కేంద్రం ఉన్న నగరం, తేదీ వంటి ప్రాథమిక వివరాలు ఇందులో పొందుపరిచినట్లు అధికారులు తెలిపారు. దీంతో పరీక్షకు హాజరయ్యే వారు ముందస్తుగా ప్రయాణ ఏర్పాట్లు చేసుకునే అవకాశం లభించింది. ఇక ప్రవేశ పత్రాలు పరీక్ష తేదీకి నాలుగు రోజుల ముందు విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉదాహరణకు మార్చి ఆరు తేదీన పరీక్ష రాయాల్సిన అభ్యర్థులకు మార్చి మూడు తేదీన ప్రవేశ పత్రాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రవేశ పత్రంలో పరీక్ష కేంద్రం పూర్తి చిరునామా, సమయం, సూచనలు ఉంటాయి.అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ను తరచుగా పరిశీలిస్తూ తాజా సమాచారం తెలుసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్షకు హాజరయ్యే ముందు సిటీ సమాచార పత్రం, ప్రవేశ పత్రం వివరాలు సరిచూసుకుని అవసరమైన పత్రాలు వెంట తీసుకురావాలని స్పష్టం చేశారు.

## ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ..

**-అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడికి రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం..**

**ఇల్లంతకుంట,మార్చి 01 (మన వార్త ప్రతినిధి):**ఇల్లంతకుంట మండలం జంగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన విలాసాగరం కృష్ణ కుమారుడు అనారోగ్యంతో బాధపడుతూ ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.వైద్య ఖర్చులు అధికంగా ఉండటంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. ఈ విషయాన్ని స్థానిక గ్రామ నాయకుల ద్వారా కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇప్ప సుధాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా,ఆయన ద్వారా మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి సమస్యను వివరించారు.సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి రూ.2 లక్షల 50 వేల ఎల్ఓసీని మంజూరు చేసి అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఇప్ప సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



## అనంతారంలో ఉచిత వైద్య శిబిరం..

**-300 మందికి పరీక్షలు-ఉచిత మందుల పంపిణీ..**

**ఇల్లంతకుంట,మార్చి 01 (మన వార్త ప్రతినిధి):**ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేశం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పాలకవర్గం సహకారంతో కరీంనగర్ అపెక్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్,ఆద్య చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్యుల నేతృత్వంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ శిబిరం జరిగింది. ఈ శిబిరంలో డాక్టర్లు ఎండి అల్మాస్ తాలిబ్,ఎండి భరత్ వైద్య సేవలు అందించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగిన శిబిరంలో సుమారు 300 మందికి ఈసీజీ,జీఆర్‌బీఎస్,షుగర్,బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్యం తమకు అత్యంత ప్రాధాన్యమని తెలిపారు.ప్రతి ఒక్కరు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించుకోవచ్చన్నారు.అవసరమైనప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా ఆరోగ్య సమస్యలను నియంత్రించుకోవచ్చని సూచించారు. శిబిరం ఏర్పాటు చేసిన వైద్య బృందానికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కదం జయంత్, వార్డ్ మెంబర్లు గ్రామ ప్రజలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.




## క్లియర్ విజన్ ఐ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**బెజ్జంకి,మార్చి1 (మన వార్త ప్రతినిధి)**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ళ గ్రామంలో ఆదివారం గుగ్గిళ్ల గ్రామంలో క్లియర్ విజన్ కంటి ఆసుపత్రి హైదరాబాద్,పేరం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ నవీన ఎన్వి సుభాష్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కంటి వైద్య శిబిరాన్ని గుగ్గిళ్ళ గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ళ మల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన మాట్లాడుతూ గుగ్గిళ్ల, తిమ్మాయపల్లి గ్రామాలకు చెందిన సుమారు 200 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసి, అవసరమైన వారికి కంటి అద్దాలను,అవసరమైన వారికీ కంటి ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ నవీన-శుభాష్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ళ మల్లయ్య, మాట్లాడుతూ మా యొక్క గ్రామానికి వచ్చి ఉచిత కంటి వైద్య సేవలు అందించడం చాలా సంతోషంగా ఉందని,మా గ్రామ ప్రజలకు ఈ యొక్క అవకాశాన్ని కల్పించిన క్లియర్ విజన్ ఐ హాస్పిటల్ యాజమాన్యానికి డాక్టర్ నవీన-ఎన్వి శుభాష్ కీ గ్రామ ప్రజల పక్షాన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ళ మల్లయ్య, దానబోయిన పోచయ్య,శానగొండ శ్రీనివాస్ రెడ్డి, శానగొండ సంతోష్,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బెజ్జంకిలో ఘనంగా మాదిగ అమర వీరుల దినోత్సవ వేడుకలు



**బెజ్జంకి, మార్చి 1( మన వార్త ప్రతినిధి)**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలను అనుసరిస్తూ మార్చి 1వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకొని అంబేద్కర్ కూడలి వద్ద ఎమ్మార్పీఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల నుండి జరిగిన పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ నేడు అమలులోకి వచ్చిందని, ఈ యొక్క వర్గీకరణకి అమరులైన వారి యొక్క త్యాగలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బెజ్జంకి మండల అధ్యక్షులు వద్దూరి పర్శరాములు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో జాతి కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించిన మాదిగ అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యతని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి చింతకింది పర్శరాములు, ప్రధానకార్యదర్శి మెడుంపెల్లి రాజు, ఉపాధ్యక్షులు శంకర్ పట్టణ అధ్యక్షులు బోనగిరి. చంద్రయ్య, సీనియర్ నాయకులు యువ న్యాయవాది వార్డ్ సభ్యులు లింగాల శ్రీనివాస్, బీసీ గౌడ సంఘం నాయకులు బోనగం రమేష్, స్వేరో రాష్ట్ర నాయకులు బొర్ర సురేష్ కుమార్, సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షులు ఉప్పులేటి బాబు, విరపూర్ గ్రామశాఖ అధ్యక్షులు చిలుముల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## గుగ్గిళ్ల గ్రామ శుద్ధిజల కేంద్ర నూతన కమిటీ ఎన్నిక



**బెజ్జంకి, మార్చి 1(మన వార్త ప్రతినిధి )**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ (శుద్ధిజల)కేంద్ర నూతన కమిటీని ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా కొంకటి ఆగయ్య,ఉపాధ్యక్షులుగా గుగ్గిళ్ల శంకర్ బాబు,కోశాధికారిగా కుంభం తిరుపతి, కమిటీ సభ్యులుగా నంగునూరు రాజయ్య,చిట్టి గంగయ్య,పోతు రాజమౌళి,ఎండి మహబూబ్ అలీటమైబుఉ,సోమ సారయ్య, వేముల శ్రీధర్,నంగునూరు రాజు నీ గ్రామ ప్రజల సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి ఎల్లప్పుడు మినరల్ వాటర్ అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన నూతన ప్లాంట్ కమిటీని గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ళ మల్లయ్య ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపి శాలవాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుగ్గిళ్ల గ్రామ పంచాయితీ పాలక వర్గ సభ్యులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్పి రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన అధ్యక్షులుగా కొమ్మాట అశోక్ నియామకం



**రాజన్న సిరిసిల్ల:** బహుజన్ సమాజ్ పార్టీ (BSP) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రమ్ శేఖర్ ఆదేశాల మేరకు, రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన అధ్యక్షులుగా బందనకల్ గ్రామానికి చెందిన కొమ్మాట అశోక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ:"నాపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గౌరవనీయులు ఇబ్రమ్ శేఖర్ అన్నకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా, జిల్లాలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తాను."గ్రామ స్థాయి నుండి పార్టీ క్యాడర్‌ను బలోపేతం చేసి, బహుజన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని అశోక్ పేర్కొన్నారు. జిల్లాలోని పేద, అట్టడుగు వర్గాల సమస్యల పరిష్కారం కోసం బిఎస్పి నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులకు మరియు కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు..

## పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ ను మరియు జూనియర్ కళాశాలను సందర్శించిన కేంద్ర ప్రభుత్వ బృందం



**నిజామాబాద్ జిల్లా సిరికొండ( మన వార్త) మార్చ్ 1**సిరికొండ మండలంలోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్‌ను తేదీ 28-2-2026 న సందర్శించిన కేంద్ర బృందం కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం 'పీఎం శ్రీ' (పీఎం శ్రీ ) అమలు తీరును పరిశీలించేందుకు ఉన్నతాధికారుల బృందం శనివారం సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాలను సందర్శించింది. ముఖ్య అతిథులు మరియు అధికారులు ఈ తనిఖీ కార్యక్రమానికి కేంద్ర టెలికమ్యూనికేషన్ శాఖ జాయింట్ సెక్రటరీ (ఇదాస్ ) దేవేంద్ర కుమార్ రాయ్ నాయకత్వం వహించారు. వీరితో పాటు శ్రీమతి విజయలక్ష్మి బాయి (డైరెక్టర్, సైట్ ) పి . అశోక్ (జిల్లా విద్యాశాఖాధికారి డి ఈ ఓ )పి . శ్రీనాథ్ గారు (స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్)జిల్లా ఎఫ్ఏఓ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు. తనిఖీ ముఖ్యాంశాలు ఈ సందర్భంగా అధికారులు పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, డిజిటల్ క్లాస్‌రూములు, స్మార్ట్ బోర్డులు మరియు సైన్స్ ప్రయోగశాలలను క్షుణ్ణంగా పరిశీలించారు. పీఎం శ్రీ పథకం కింద అందుతున్న నిధుల వినియోగం, డిజిటల్ లెర్నింగ్ అమలు, మరియు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ( నెప్ -2020) మార్గదర్శకాల అమలుపై పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ గడ్డం రాజేష్ రెడ్డి సమగ్ర వివరణ ఇచ్చారు అటల్ టింకరింగ్ ల్యాబ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాసులు మరియు ఇన్నోవేటివ్ టీచింగ్ పద్ధతులను అధికారులు పరిశీలించి ప్రశంసించారు. విద్యార్థులతో ముఖాముఖి జాయింట్ సెక్రటరీ దేవేంద్ర కుమార్ రాయ్ విద్యార్థులతో నేరుగా ముచ్చటించి, పీఎం శ్రీ పథకం ద్వారా అందుతున్న విద్యా సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ లెర్నింగ్ అవకాశాలు మరియు ఇతర విద్యా కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిభ, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను చూసి అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. వొకేషనల్ ఎడ్యుకేషన్ ప్రత్యేకత వొకేషనల్ ఎడ్యుకేషన్ విభాగంలో అగ్రికల్చర్ మరియు ఐటీ / ఐ టి ఈ ఎస్ ట్రేడ్స్ అమలు తీరు, ప్రాక్టికల్ శిక్షణ, కిచెన్ గార్డెన్ నిర్వహణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అధికారులు స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను మెచ్చుకుని, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలకు ఇవి దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. అధికారుల ప్రశంసలు పాఠశాలలో అమలు చేస్తున్న వినూత్న విద్యా కార్యక్రమాలు, క్రమశిక్షణ, అకాడమిక్ ప్రమాణాలు మరియు సమర్థవంతమైన నిర్వహణను బృందం ప్రత్యేకంగా అభినందించింది. మోడల్ స్కూల్స్ ద్వారా గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం సంతోషదాయకం అని దేవేంద్ర కుమార్ రాయ్ పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు, ప్రిన్సిపాల్ శ్రీ గడ్డం రాజేష్ రెడ్డి మరియు ఉపాధ్యాయ బృందం కృషిని కొనియాడుతూ, పీఎం శ్రీ కార్యక్రమాలను ఇదే ఉత్సాహంతో కొనసాగించాలని సూచించారు.

## రాయపోల్ మండల కేంద్రంలో ఘనంగా మాదిగ అమర వీరుల సంస్మరణ వేడుకలు



**రాయపోల్, మార్చి 1( మన వార్త)**రాయపోల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలను అనుసరిస్తూ మార్చి 1వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకొని రాయపోల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుర నర్సింలు మాదిగ ఎమ్మార్పీఎస్ మండలశాఖ అధ్యక్షులు అయ్యగల్ల రవి మాదిగ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల నుండి జరిగిన పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ నేడు అమలులోకి వచ్చిందని, ఈ యొక్క వర్గీకరణకి అమరులైన వారి యొక్క త్యాగలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రాయపోల్ మండల అధ్యక్షులు అయ్యగాల రవి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుర నర్సింలు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో జాతి కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించిన మాదిగ అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యతనీ గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ గ్రామ సర్పంచ్ మాసన్ పల్లి రాజు, మండల ప్రధాన కార్యదర్శి మల్లేశం ,నర్సింలు మాదిగ, స్వామి, కళాకారుడు స్వామి మాదిగ ,నర్సింలు మాదిగ ,మండల కోశాధికారి లక్ష్మణ్ మాదిగ ,కొత్తపల్లి స్వామి మాదిగ ,వడ్డేపల్లి రవి మాదిగ ,తదితరులు పాల్గొన్నారు

## TUWJ 143 జర్నలిస్టుల మండల కార్యవర్గం ఎన్నిక



**కొడిమ్యాల : మార్చి 1 మన వార్త ప్రతినిధి** జగిత్యాల జిల్లా జనరల్ సెక్రటరీ అల్లగట్ట గంగాధర్ ఆధ్వర్యంలో అధ్యక్షులు గా చొక్కాల మహిపాల్ గౌరవ అధ్యక్షులు గా సతీష్ రావు ఉపాధ్యక్షులు గా కొండూరి సురేష్, చెన్న దేవేందర్ ప్రధాన కార్యదర్శి గా దికొండ చెంద్రశేఖర్ కోశాధికారిగా బోగ సూర్యతేజ, కార్యవర్గ సభ్యులుగా అల్లగట్ట గంగాధర్,కొల్లూరి రవీందర్,గుండు శెకర్,M.D రఫి,మొగిలిపాలెం శ్రీనివాస్ ఎన్నికైన సభ్యులను అభినందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లగట్ట గంగాధర్ మాట్లాడుతూ. రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగుల రాంగోపాల్, జిల్లా అధ్యక్షులు శికారి రామకృష్ణ, టెంజు అధ్యక్షులు అంజుగౌడ్ ఆదేశాల మేరకు యూనియన్ కార్యవర్గన్ని ఎన్నుకోవడం జరిగిందని, యూనియన్ బలోపేతనికి అందరం కలసి కట్టుగా సహకరిస్తామని అల్లగట్ట గంగాధర్ తెలిపారు

## ఉపాధ్యాయుల జీతాలపై తెలంగాణ విద్యా కమిషన్ రిపోర్ట్ అభ్యంతరకరం..




**-టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్...**

**గజ్వేల్, మార్చి 1, మన వార్త ప్రతినిధి** గజ్వేల్ తెలంగాణ విద్యా కమిషన్ తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించిన తెలంగాణ విద్యాపాలసి రిపోర్టును తెలంగాణలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటను చట్టబద్ధం చేస్తూ ఇచ్చిన రిపోర్టుగా తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ భావిస్తూ, కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ లోని కొన్ని అంశాల పట్లఅభ్యంతరకరమని, దీనిపై విచారం వ్యక్తం చేస్తున్నామని టిపిటిఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ అన్నారు. గజ్వేల్ జోన్ కార్యాలయంలో మీడియాతోమాట్లాడుతూ,కమిషన్ ఇచ్చిన రిపోర్టును పరిశీలిస్తే పల్లెల్లో ఉన్నటువంటి మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల మూసివేతను చట్టబద్ధం చేస్తున్నట్లుగా అనిపిస్తుందని. మండల పరిషత్ పాఠశాలల, జిల్లా పరిషత్ పాఠశాలల సమస్యలు,వాటిపరిష్కారాలు ప్రస్తావించకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తున్నటువంటి తెలంగాణ ప్రభుత్వం డైరెక్షన్ లోనే ఈ కమిటీ పని చేసిందని, ఏ కమిషన్ అయినా ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థను ప్రతిపాదించే ముందు ప్రస్తుత వ్యవస్థలో గల లోపాలు, కారణాలు చూపుతూ ప్రత్యామ్నాయ వ్యవస్థను ప్రతిపాదిస్తుంది కానీ తెలంగాణవిద్యాకమిషన్ ఆవిధంగావ్యవహరించకపోవడంగమనార్హమనిఅన్నారు. ఎన్నోఉద్యమాలతోసాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ విద్యా పాలసీని రూపొందిస్తుంటే అది దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉంటుందని అనుకున్నామని కానీ, కమిషన్ దాని పరిధిలో లేని అంశాలను ప్రస్తావిస్తూ ఉపాధ్యాయులను గందరగోళంలోకి నెట్టి, తెలంగాణ సమాజం దృష్టిలో ఉపాధ్యాయుల స్థాయిని తగ్గించే ప్రయత్నం చేసినట్లుగా మనకు కనిపిస్తుంది. విద్యారంగానికి 18శాతంబడ్జెట్కేటాయించాలనే ప్రతిపాదనను స్వాగతిస్తూ, ఉపాధ్యాయుల జీతాలు రేషనలైజ్ చేయాలని, ప్రతిభ ఆధారంగానే ప్రమోషన్లు ఇవ్వాలని సూచించడం కమిషన్ కు ఉపాధ్యాయ వర్గం పైన ఉన్న వ్యతిరేకతను సూచిస్తుంది. ఉపాధ్యాయుల జీతాలను తీసుకుంటే ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల కన్నా తక్కువ జీతాలు తెలంగాణలో ఉన్నాయని, ఉపాధ్యాయ జీతాలు తెలంగాణాలో ఎక్కువ ఉన్నాయని కమిషన్ పేర్కొనడం, కమిషన్ అవగాహన రాహిత్యానికి నిదర్శనమని అన్నారు. ఇట్టి కార్యక్రమం లో రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, జోన్ కన్వీనర్ శ్రీనివాస్, వర్గల్, గజ్వేల్ మండలాల అధ్యక్షులు పర్వతం నర్సయ్య, తాళ్ల నాగరాజు, ములుగు మండల ప్రధానకార్యదర్శిరాజనర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## బీహార్, ఒడిస్సా కూలీలకు బట్టలు గృహోపకరణాల పంపిణి

**-నిరుపేదలకు , అనాధ కుటుంబాలకు మేలుగా హెల్పింగ్ హోమ్.....**

**-దాతల సహాయం మరువ లేము :లంకా.......**

**మధిర,మార్చి 01 ( మన వార్త ):** ఈ సీజన్ లో వివిధ రాష్ట్రముల నుండి ఖమ్మం జిల్లా మధిర నియెజక వర్గం లో అనేక ప్రాంతాల్లో గ్రామీణ ప్రాంత రైతు సోదర్ల పంట పొలాల్లో మిర్చి కోయుటకు అనేక నిరుపేద గిరిజన



గోత్తి కోయుల కుటుంబాలు వలస వచ్చి పొలంలో గుడారశీ వేసుకొని జీవిస్తున్నారు.పాపం వారి జీవన పరిస్థితులు గమనించిన ప్రముఖ సంఘ సేవకులు (మధిర ఆశ మిత్ర )లంకా కొండయ్య తన ఫీల్డ్ విజిట్ లో ఎదురు పడిన వలస కూలీలకు తన ఇంటి అడ్రస్ ఇచ్చి, ప్రతి ఆదివారం గిరిజన సంత ను తల పించే విధంగా మధిర పట్టణంలోని అజాద్ రోడ్డులో తన గృహంనందు ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ ఉచిత పాత బట్టల కేంద్రం ద్వారా మరియు తాను ఏర్పాటు చేసిన హ్యాల్పింగ్ హోమ్ (మన ఇంటిలో అదనపు వస్తువులు..., వంట పాత్ర లు ఇతర వస్తువులు )ద్వారా వివిధ దాతలు నుంచి సేకరించిన బట్టలు వస్తువుల ను ఈ రోజు ఆదివారం పేద లుకు, మహారాష్ట్ర, బీహార్, ఓడిషా కూలీలుకు కొండయ్య చేతులు మీదుగా పంచడం జరిగింది. ఈ దుస్తులను రైతు సోదర్లు వెలివెల శ్రీనివాస రావు స్వప్న దంపతులు, ప్రముఖ ఆర్య వైశ్య మిత్రులు ఇరుకుళ్ళ బాల కోటేశ్వరరావు దంపతులు, అజాద్ రోడ్డు డైరి మిల్క్ వ్యాపారి జల్లా కాళేశ్వరరావు (వంట పాత్రలు ), ఖమ్మం పా డు రైతు సోదరులుకళ్యాణపు పుల్లారావు తండ్రి నాగేశ్వరావుమరియు ఖాజీపురం ముస్లిం సహో దరుడు ఖాషిమ్ భాయ్, మధిర బ్రాహ్మణ పరిషత్ సభ్యులు, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి మురళి కృష్ణ శర్మ, ప్రకాష్ టైపు ఇన్స్టిట్యూట్ రమేష్ శీలం శ్రీనివాస రెడ్డి ఇంకా అనేక మంది దయార్థ హృదయులు మానవతా దృక్పధంతో మానవ సేవే బాగావంతుడు సేవగా భావించి ఈ దాతృత్వ కార్యక్రమం చేపట్టి సమాజం హితం కోసం పాటు పడుతున్నారని కొండయ్య వివరించారు.ఈ కార్యక్రమంలో లంకా సేవా ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## 20 వ వార్డ్ కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ కు మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం



**గజ్వేల్ మార్చ్ 01 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 20 వ వార్డ్ కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ కు ఆదివారం మహమ్మదీయ మజీద్ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి ఘన సన్మానం చేసి అభినందనలు తెలిపారు, ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ, 20 వార్డు కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ ప్రజా నాయకుడు అని, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న అత్తిలి శ్రీనివాస్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఘన విజయం సాధించారని వారికి మంచి రాజకీయ భవిష్యత్తు ఉన్నదని రాబోయే రోజుల్లో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకోవడం జరిగిందని, రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా వారికి చిరు సత్కారం చేసి అభినందనలు తెలియజేయడం జరిగిందని అన్నారు, అనంతరం కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, హిందూ ముస్లిం భాయి భాయి అని, భారతదేశం సర్వతో ముఖాభివృద్ధికి ప్రజలంతా సమిష్టిగా ఉండాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 20వ వార్డులో అందరం కలిసికట్టుగా ఉంటామని రాబోయే రోజుల్లో 20 వార్డు అభివృద్ధి కోసం అందరం కలిసి ఆదర్శవంత వార్డుగా చేయడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు అలాగే ముస్లిం సోదరీ సోదరీమణులకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు

## న్యావనంది గ్రామంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో మల్లన్న గుడిలో హైమస్ లైట్లు



**నిజామాబాద్ జిల్లా సిరికొండ ( మన వార్త) మర్చి 1** సిరికొండ మండలం న్యావనంది గ్రామంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో మల్లన గుడిలో హైమాస్ లైట్ ని మంజూరు చేయడం జరిగింది. ఐమస్ లైట్ ని యువజన నాయకులు ఉమ్మాజీ నరేష్ ఓపెనింగ్ చేయడం జరిగింది.

## మోడల్ బాలికల హాస్టల్ ఆకస్మిక తనిఖీ చేసిన కాంగ్రెస్ నేత మట్ట వెంకటయ్య గౌడ్



**కల్వకుర్తి మార్చ్ 01 మన వార్తా ప్రతినిధి** కల్వకుర్తి నియోజకవర్గం లోని వెల్దండ మండల కేంద్రంలోని మోడల్ బాలికల హాస్టల్ ను పరిశీలించిన కాంగ్రెస్ నేత మట్ట వెంకటయ్య గౌడ్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచిందని అన్నారు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, స్నాక్స్, తదితర విషయాలపై విద్యార్థులను ఆరాతీశారు.పోటీ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముదిగొండ రమేష్,సిబ్బంది మంజుల ,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మట్ట భరత్ ,విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిత్తారమ్మ దేవాలయంలో నూతన పాలకవర్గానికి ఘన సన్మానం

**రామాయంపేట మార్చి 1 ( మన వార్త ప్రతినిధి)** అభివృద్ధి అంటేనే మైనంపల్లి అని రామయంపేట మున్సిపాలిటీని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుల సహకారంతో అన్ని రంగాలలో అభివృద్ధి పరుచుకోవడం జరుగుతుందని మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు అన్నారు,



రామయంపేట మున్సిపల్ పట్టణంలోని శ్రీ చిత్తారమ్మ దేవాలయం వద్ద నూతనంగా ఎన్నికైన పాలకవర్గం ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం సగర సంగం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సివల్ పాలకవర్గాన్ని సగర సంగం మరియు సగర యువజన సంఘం ఆధ్వర్యంలో శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గం మాట్లాడుతూ రామాయంపేట మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి పరచడం జరుగుతుందని మున్సిపల్ పట్టణ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ పట్టణంలోని 12 వార్డులను అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తూ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడం కోసం ప్రతి ఒక్కరం కృషి చేయాలని వారన్నారు, ప్రజలు నాపై నమ్మకంతో మమ్మల్ని ఎన్నుకోవడం జరిగిందని వారు నమ్మకాన్ని వర్మ చేయకుండా అభివృద్ధి చేయడమే మా లక్ష్యమని వారన్నారు ప్రజలు తమపై ఉంచిన అవిశ్వాసం ప్రతిరోజు తమను మరింత బాధ్యత అధికంగా పని చేయాలని గుర్తు చేస్తుందన్నారు, మెదక్ నియోజకవర్గంలో ఎక్కడ లేని విధంగా రామాయంపేటలో అభివృద్ధి పనులు సాగుతున్నాయని రాబోయే రోజుల్లో మరింత వేగవంతంగా అభివృద్ధి చేస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో సగర సంగం సభ్యులు, సగర యూత్ సభ్యులు, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హత్య చేసిన కేసును రామాయంపేట్ పోలీసులు దాకచక్యంగా ఛేదించారు



**-రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్ ...**

**చేగుంట మార్చి 1 ( మన వార్త ప్రతినిధి)** డబ్బుల కోసం భార్యను పరతో కొట్టి హత్య చేసిన కేసును రామాయంపేట్ పోలీసులు దాకచక్యంగా ఛేదించారు. ఈ మేరకు నిర్వహించిన మీడియా సమావేశంలో రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్ కేసు వివరాలను వెల్లడించారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారండ 2015 సంవత్సరంలో మృతురాలు వరలక్ష్మి, నిందితుడు ముఠా త్రిమూర్తులకు రెండో వివాహం జరిగింది. వివాహానంతరం నిందితుడు ఇల్లరికం వచ్చి చేగుంటలో నివాసం ఉంటూ వచ్చాడు. వీరికి దుర్గాప్రసాద్ (10) అనే కుమారుడు ఉన్నాడు.రెండు సంవత్సరాల క్రితం కుటుంబ పోషణ కోసం వరలక్ష్మి కాళ్ళకల్ ఐటిసి కంపెనీలో ఉద్యోగానికి వెళ్లడం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో నిందితుడు ఎలాంటి పని చేయకుండా ఇంట్లోనే ఉంటూ భార్యను డబ్బుల కోసం వేధించేవాడు. తరచూ జరిగే గొడవలతో భార్యపై ద్వేషం పెంచుకున్న నిందితుడు ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు.తేదీ 21.02.2026 అర్ధరాత్రి భార్య, కుమారుడు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉన్న పరతో వరలక్ష్మి తలపై దాడి చేయగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం మృతురాలి వద్ద ఉన్న 39.55 గ్రాముల బంగారు పుస్తెలతాడు, రూ.5,000 నగదు, సెల్ ఫోన్ తీసుకుని అన్నవరం పారిపోయాడు.నమ్మదగిన సమాచారం మేరకు రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్ నేతృత్వంలో ప్రత్యేక బృందం నిఘా ఏర్పాటు చేసి, 01.03.2026 ఉదయం చేగుంట బస్టాండ్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేసి. అతని వద్ద నుంచి బంగారు పుస్తెలతాడు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును ఛేదించిన రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, తూప్రాన్ సీఐ రంగకృష్ణ, చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి, ఎస్ఐ భిక్యా నాయక్, కానిస్టేబుళ్లు భాస్కర్, రాజశేఖర్, సాజిద్ అలీ, హోంగార్డ్ రవీందర్‌లను మెదక్ జిల్లా ఎస్పీ అభినందించారు.

## భద్రాచలంలో శ్రీ సీతారామ కళ్యాణం, మహా పట్టాభిషేకం ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష

**-కల్యాణం పట్టాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించండి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి...**

**భద్రాచలం, మార్చి 01. ( మన వార్త ప్రతినిధి ).**దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి




కల్యాణం, మహా పట్టాభిషేకం మహోత్సవాలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అంగరంగ వైభవంగా నిర్వహించేలా అన్ని సౌకర్యాలు సమకూర్చాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార􏰀పౌర సంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. దేశ విదేశాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా సమగ్ర ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఆదివారం భద్రాచలంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణం, పట్టాభిషేకం నిర్వహణపై మంత్రి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ముఖ్యమంత్రి సహా ఇతర వీవీఐపీలు, వీఐపీలు కల్యాణాన్ని వీక్షించేందుకు రానున్నారని తెలిపారు. కేటాయించిన బాధ్యతలకే పరిమితం కాకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి భక్తులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈనెల 27వ తేదీన స్వామివారి కల్యాణం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు, 28వ తేదీన మహా పట్టాభిషేకం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు జరుగుతుందని మంత్రి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం టికెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు తలంబ్రాలు, ప్రసాదాల పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో 50 బెడ్లు, ప్రత్యేక వార్డు సిద్ధం చేయాలని, పర్ణశాళమొత్తం 13 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సిబ్బంది, మందులు సరిపడా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.కల్యాణం వీక్షణ కోసం మండపాన్ని 26 సెక్టార్లుగా ఏర్పాటు చేసిన నేపథ్యంలో ప్రతి సెక్టార్‌కు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, తాగునీటి ట్యాపులు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ ప్రాంతాలతో పాటు ఏడు చోట్ల మరియు భద్రాచలం పట్టణంలో నీటి డ్రమ్‌లు ఏర్పాటు చేసి గ్రామపంచాయతీ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. కరకట్ట ప్రాంతం నుంచి కల్యాణం జరిగే స్టేడియం వరకు, పట్టణం, దేవాలయం పరిసరాల్లో నిరంతర శానిటేషన్ చర్యలు చేపట్టి అవసరమైన గ్రామపంచాయతీ లేబర్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు.తలంబ్రాల పంపిణీకి 80 కౌంటర్లు, లడ్డూల సరఫరాకు 20 కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రతిరోజు లక్షన్నర లడ్డూలు భక్తులకు అందేలా చర్యలు చేపట్టాలని, ఈసారి ప్రసాదాలు కొరత లేకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. ములుగు రోడ్ నుంచి భద్రాచలం వచ్చే అన్ని అప్రోచ్ రోడ్లకు ప్యాచ్ వర్క్ చేయించి రోడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.కల్యాణం-పట్టాభిషేకం పూర్తయ్యే వరకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సారపాక నుంచి భద్రాచలం పట్టణంలో పూర్తి స్థాయిలో వెలుగులు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైతే 500 కెపాసిటీ గల కేవీ-2 జనరేటర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా భారీ కేడింగ్ ఏర్పాటు చేయాలని, రిస్క్ బోట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, మహిళల కోసం బట్టలు మార్చుకునే షెల్టర్లు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ శాఖను ఆదేశించారు. టీఎస్‌ఆర్టీసీ ద్వారా ఉదయం నుంచే కల్యాణ మండపానికి భక్తులు చేరుకునేలా బస్సులు నడపాలని సూచించారు.సమీక్షకు గైర్హాజరైన ఆర్టీసీ డీఎంకు షోకాజ్ నోటీసు జారీ చేసి సమాధానం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్‌కలెక్టర్ మ్రినాలి శ్రేష్ట, ఎస్పీ రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, సర్పంచ్ పునేం కృష్ణదొరతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మున్సిపల్ చైర్మన్ లావణ్య నాగరాజు గుప్తా



**రామాయంపేట మార్చి 1( మన వార్త ప్రతినిధి)** రామయంపేట మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డులో లస్కర్ వెంకటేష్ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ సూచనల మేరకు మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్త ఐదువేల రూపాయల ఆర్థిక సాయంతో పాటు 50 కిలోల బియ్యాన్ని అందించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా, తో పాటు గాయంతి కుమార్, పల్లె రాజు, బత్తుల రవి, తోపాటు యాదవ సోదరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుని పురామర్శించిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్




**మధిర మార్చి 1( మన వార్త ):**తొర్లపాడు గ్రామ మాజీ వార్డ్ సభ్యుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేల్పుల సత్యం కి ఇటీవల కాలంలో హార్ట్ స్ట్రోక్ రాగ ఖమ్మం ఆరోగ్య హాస్పిటల్లో గుండెకు సంబంధించిన శాస్త్ర చికిత్స చేపించుకోని తొర్లపాడులో తన నివాసనికి వచ్చిన సత్యం ని పరామర్శించి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ మరియు తొండల గోపవరం గ్రామ సర్పంచ్ ఖన్నశీ సాహెబ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకటరెడ్డి వాసిరెడ్డి రవికుమార్ సూర్యదేవర వెంకటేశ్వర్రావు గ్రామ శాఖ అధ్యక్షులు మరియు వార్డు మెంబర్ చేబ్రోలు కృష్ణ వార్డ్ మెంబర్లు వేర్ల వెంకయ్య కాశిబోయిన అరుణ శంకర రామారావు మేడేపల్లి భవాని షేక్ బికార్ సాహెబ్ యూత్ కాంగ్రెస్ నాయకులు వేల్పుల ప్రవీణ్ కాశీబోయిన శేష్ కుమార్ మామిళ్ళ నరేష్ పగడాల సురేష్ కాశి బోయిన పెద్ద మాధవరావు పాతూరి మల్లేశ్వరి కాశీబోయిన మల్లేశ్వరి కాశీబోయిన నరసింహారావు వేల్పుల సాంబయ్య రొయ్యల మల్లికార్జునరావు షేక్ నాగుల మేర చాంద్బి నాగుల్ భాష బేగం మటన్ గోపి సుకన్య కాసిం సాహెబ్ తదితరులు పరామర్శించినారు

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సీతక్క



**ములుగు జిల్లా మార్చి1 మన వార్త**ఆదివారం గోవిందరావుపేట మండల కేంద్రానికి చెందిన కొంగర అప్పారావు గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మాత్యులు దనసరి అనసూయ సీతక్క పరామర్శించి వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రేగ కళ్యాణి, మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ, కార్మికశాఖ జిల్లా అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, మహిళా జిల్లా అధ్యక్షురాలు మద్దాలి నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి జెట్టి సోమయ్య, సర్పంచ్ లావుడ్య జోగా నాయక్ గార్లతో పాటుగా మండల కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు అందరూ పాల్గొన్నారు.

## ఆర్ఎంపీ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా పెంట సాంబయ్య




**శంకరపట్నం:మార్చి01(మనవార్త ప్రతినిధి)**శంకరపట్నం మండల ఆర్ఎంపీ అసోసియేషన్ మండల కమిటీని అన్ని గ్రామాల ఆర్ఎంపీల సమక్షంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల అధ్యక్షునిగా మొలంగూర్ గ్రామానికి చెందిన పెంట సాంబయ్య,ప్రధాన కార్యదర్శిగా రాజాపూర్ గ్రామానికి చెందిన పెసరి వీరార్జున్,కోశాధికారిగా కన్నాపూర్ గ్రామానికి చెందిన గుండేటి సమ్మయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ,,మండలంలో ఆర్ఎంపీల సమస్యల పట్ల కృషి చేస్తానని అన్నారు.ఆర్ఎంపీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తానని ఆయన పేర్కొన్నారు.అధ్యక్షునిగా ఎన్నుకున్న వివిధ గ్రామాల ఆర్ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ఆరెంపీలు పాల్గొన్నారు.

## మార్చి 3న యాదగిరిగుట్ట ఆలయం మూసివేత...



**–ఆలయ ఈఓ భవాని శంకర్...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 01** ఈ నెల 3వ తేదీ మంగళ వారం మద్యాహ్నం 3 గంటలు 20 నిమిషాలకు సంపూర్ణ చంద్రగ్రహణం ప్రారంభమై సాయంత్రం 6 గంటల 47 నిముషాల వరకు గ్రస్తోదయ చంద్రగ్రహణం కారణంగా ప్రధాన ఆలయములు , ఉప ఆలయములు , అనుబంధ దేవాలయములలో ఉదయము 7 గంటలు లోపు సుప్రభాతము , నిజా అభి షేకము , అర్చనలు , బాల భోగము ముగించి దేవాలయం మూసి వేయబడునని దేవస్థాన కార్యనిర్వాహణాధికారి జే. భవానీ శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరుసటి రోజు తేది. మార్చి 4 2026 బుధవారం రోజున ఉదయం 3 గంటలు 30 నిముషాలకు ప్రధాన ఆలయం , ఉప ఆలయములు తెరిచి సంప్రోక్షణ కార్యక్రమములు నిర్వహించబడునని చెప్పారు. చంద్రగ్రహణం సందర్భంగా తేది. 04.03.2026 రోజున శ్రీ స్వామి వారి ఆలయం , ఉప ఆలయములలో నిత్య కైంకర్యముల సమయ వేళలలో మార్పులు చేశామన్నారు. 03.03.2026 పురస్కరించుకొని శ్రీ స్వామి వారి సన్నిధిలో జరపబడు హోలికోత్సవము రద్దు పరచి ముందు రోజు తేది. 02.03.2026 సోమవారం రోజున సాయంత్రం. నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు.

## దేవక్కపల్లి లో చెరువు కట్టపై చనిపోయిన కోళ్ల వ్యర్థాలు..



**–ఇబ్బందుల్లో ప్రజలు...**

**బెజ్జంకి, మార్చి 1( మన వార్త ప్రతినిధి )**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని దేవక్కపల్లి గ్రామంలో చెరువు కట్టపై చనిపోయిన కోళ్ల వ్యర్థాలను వేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ గ్రామస్తుల నుండి వినికిడి.చెరువు కట్ట వెంట పెద్ద మొత్తంలో కోళ్ల మృతదేహాలు, వ్యర్థాలు పడేయడంతో దుర్వాసన వ్యాపించి పరిసర ప్రాంతాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఈ దుర్వాసన కారణంగా రహదారి మీదుగా వెళ్లే ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా వ్యర్థాలు పేరుకుపోవడంతో ఈగలు, దోమలు పెరిగి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి పక్కనే ఈ పరిస్థితి ఉండడంతో గ్రామ ప్రతిష్ట దెబ్బతింటుందని స్థానికులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కోళ్ల వ్యర్థాలను తొలగించి, మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నార్మల్ డెయిరీ పరిపాలనా సమస్యలపై సమీక్ష..



**–భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి....**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 01**నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డ్ చైర్మన్ డా. మినేష్, సి. శాహ్ తోపాటు తెలంగాణ ప్రభుత్వం పశు సంవర్ధక , మత్స్యశాఖ , యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి , ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఆయిలయ్య , తెలంగాణ స్టేట్ డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్త అమిత్ రెడ్డి , మదర్ డెయిరీ చైర్మన్ జీ. మధుసూదన్ రెడ్డి లతో కలిసి హైదరాబాద్‌లో ఉన్న నార్మల్ డెయిరీకి సంబంధించిన ఆర్థిక మరియు పరిపాలనా సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో డెయిరీ యూనియన్ ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని సమగ్రంగా పరిశీలించాం. డెయిరీ యూనియన్‌ను మళ్లీ ఆరోగ్యకరమైన మరియు స్థిరమైన కార్యకలాపాల దిశగా తీసుకెళ్లేందుకు అవసరమైన సహకారం అందించాలని నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డ్ ను అభ్యర్థించాము. ఈ సందర్భంగా చైర్మన్ సానుకూలంగా స్పందించి మాట్లాడుతూ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. బ్యాంకులకు ఉన్న బకాయిలు , రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ చెల్లింపులు క్లియర్ చేయడం , డెయిరీ కార్యకలాపాలను పునరుద్ధరించడం , సంస్థ పరిపాలనను బలోపేతం చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించబడింది.డెయిరీ స్థిరీకరణ , పున రుద్ధరణ కోసం నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డ్ ప్రతి నిధులు కొన్ని వ్యూహాత్మక ప్రతిపాదనలు సూచించారు. ఈ ప్రతిపాదనలపై రాబోయే వారాల్లో సంయుక్తంగా పనిచేసి నార్మల్ డెయిరీని దీర్ఘకాలికంగా స్థిరపరిచి , పాల ఉత్పత్తిదారుల ప్రయోజ నాలను కాపాడుతూ తెలంగాణ సహకార డెయిరీ రంగాన్ని బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నామని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## లక్ష్మీపూర్ గ్రామంలో ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

**బెజ్జంకి,మార్చి1 (మన వార్త ప్రతినిధి )**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో పోచమ్మ తల్లి, అంతగిరి పోచమ్మ తల్లికీ గ్రామ ప్రజలందరూ ఏకధాటిగా ఇంటికి ఒక బోనం చొప్పున భక్తిశ్రద్ధలతో ఆదివారం బోనాల పండుగని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ యొక్క బోనాల పండుగను కార్యక్రమాన్ని పురస్కరించుకుని, 6-3-2026 శుక్రవారం రోజున శివాలయంలో జరిగే శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి ముందు గ్రామ దేవతలైన పోచమ్మ తల్లి అంతగిరి పోచమ్మ తల్లులకు బోనాలు సమర్పించుకోవడం ఆనవాయితీగా ఉండడంవల్ల సమర్పించుకోవడం జరిగిందని గ్రామ ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, యాసంగి కాలంలో అకాల వర్షాలకు పంటలు, దెబ్బతినకుండా రైతులకు పంటలు చేతుకు రావాలని, గుడ్డు గోదా చల్లగా ఉండాలని అమ్మవార్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి...



**–ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 01** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఒక్కరోజు సభ్యత్వం భువనగిరి పట్టణంలో బహర్ పేట కాలనీలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ పాల్గొని మాట్లాడుతూ మహిళలను ఇంకా రెండవ తరగతి పౌరురాలుగా చూస్తున్నారని అన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫల మయ్యాయని మహిళలు పనిచేసే చోట భద్రత కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కోశాధికారి పట్టణ కార్యదర్శి కల్లూరి నాగమణి , పట్టణ అధ్యక్షురాలు మాయ రాణి , పట్టణ కమిటీ సభ్యురాలు గద్దె లతా , బండారు యాదమ్మ , బండారు భావన , రమ్య తదితరులు పాల్గొన్నారు.

## చింతలపల్లిలో మాదిగ అమరవీరుల స్మరణ సభ



**ఎల్కతుర్తి మార్చి 01 మన వార్త ప్రతినిధి:** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గ్రామ శాఖ అధ్యక్షులు అడ్డూరి శ్రీకాంత్ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ పోరులో అమరులైన మాదిగ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కొవత్తులతో శాంతియుతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ అడ్డూరి అనిల్ మాదిగ హాజరై మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా ఏళ్ల తరబడి పోరాటం సాగించగా ఆ ఉద్యమంలో ఎంతో మంది అమరులయ్యారని గుర్తుచేశారు. వారి త్యాగాలు ఫలించిగా వర్గీకరణ సాధ్యమైందని పేర్కొన్నారు.ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కృషితో వర్గీకరణ సాధ్యమైందని, వారికి తోడుగా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అమరులనై వారి త్యాగాలను ఎప్పటికీ మరువలేముని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కో ఇన్చార్జ్ బొంకూరి కార్తీక్ మాదిగ ఎమ్ ఎస్ ఎఫ్ ఎమ్మార్పీఎస్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## బిజెపి సర్పంచ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు 10.లక్షల నిధులు మంజూరు



**–గ్రామ అభివృద్ధి నా లక్ష్యం..**

**– కేంద్రమంత్రి బండి సంజయ్ ...**

**కోహెడ మార్చి 01(మన వార్త రిపోర్ట్ )**కోహెడ మండలం విజయ్ నగర్ కాలని గ్రామంలో గ్రామస్తులు అందరు బిజెపి పార్టీకి చెందిన సర్పంచ్ కాతం (సాదుల) అమూల్య రాజశేఖర్ రెడ్డి గారిని ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకొన్న సందర్భంగా ఈరోజున కేంద్రమంత్రి బండి సంజయ్ విజయ్ నగర్ కాలని గ్రామానికి విచ్చేసి గ్రామస్థుల సమక్షంలో 10.లక్షల ఎంపీ నిధుల కాపీని పాలకవర్గంకు అందజేశారు.కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కోహెడ మండలంలో సుమారు 40.కోట్లకు పైగా వివిధ అభివృద్ధి పనులు ఇప్పటివరకు నిధులు ఇచ్చానని ప్రజల కోసం నిరంతరం పనిచేసే తత్వం కలిగిన వ్యక్తే మీ పార్లమెంట్ సభ్యుడని కొంతమంది పనిగట్టుకుని బండి సంజయ్ ఏమి తెచ్చిండు అనేవాళ్లకు నా పనితీరే సమాధానం అన్నారు కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో సైతం మెజారిటీ 30.సీట్లలో బిజెపి కార్పొరేటర్లు గెలిచిన కొంతమంది కుటిల ప్రయత్నాలు బెడిసికొట్టి అమ్మవారి ఆశీర్వాదంతో ప్రజల దీవెనలతో మొదటిసారిగా మేయర్ సీటు సాధించామని కరీంనగర్ పార్లమెంట్ వ్యాప్తంగా అభివృద్ధి చేయడమే బండి సంజయ్ లక్ష్యమని పేర్కొన్నారు.విజయ్ నగర్ కాలని గ్రామానికి ఏకగ్రీవంగా బిజెపి సర్పంచ్ ఇచ్చినందుకు ఇచ్చిన 10.లక్షల నిధులతో పాటుగా మరో 15.లక్షలు సిసిరోడ్లకు నిధులు అందజేశామని తెలిపారు

## కౌన్సిలర్ గోలి మమత సంతోష్ దంపతులకు ఘన సన్మానం



**గజ్వేల్ మార్చ్ 01 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ రెండవ వార్డ్ కౌన్సిలర్ గా ఇటీవల ఘనవిజయం సాధించిన గోలి మమత సంతోష్ దంపతులను ఆదివారం వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపిన లింగారెడ్డి పల్లి ఉపసర్పంచ్ తోట శ్రీనివాస్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోలి మమతా సంతోష్ దంపతులకు, ప్రత్యేక అభినందనలు తెలుపుతూ బిఆర్ఎస్ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేసి పార్టీ అభ్యున్నతి కోసం కృషిచేసి కౌన్సిలర్ ఎన్నికల్లో రెండో వార్డ్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గోలి మమత సంతోష్ పోటీ చేసి ఘన విజయం సాధించారని వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు అనంతరం గోలి మమత సంతోష్ మాట్లాడుతూ రెండవ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందడం కోసం తోట శ్రీనివాస్, మాకు పూర్తిగా సహకరించారని, వారు చేసిన కృషి మరువలేనిదని వారు ప్రతినిత్యం మాకు అండగా ఉన్నారని వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు

## విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్తమ మహిళా పురస్కారాలు

**గజ్వేల్ మార్చ్ 01 మన వార్త ప్రతినిధి** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రముఖ రచయిత స్వరకర్త గాయకుడు విశ్వేశ్వర రావు కుటుంబ సభ్యుల సహకారంతో వారి మాతృమూర్తి కీర్తిశేషులు విజయలక్ష్మి జ్ఞాపకార్థం ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు పురస్కారాలు అందజేశారు, పురస్కార గ్రహీతలు శ్రీమతి తునికి ఉమారాణి విద్య, శ్రీమతి డాక్టర్ దుబకుంట మంజుల, శ్రీమతి పెండ్యాల భార్గవి మహేష్, శ్రీమతి కొత్త ముక్తా భాయ్, శ్రీమతి సుధారాణి కృష్ణంరాజు, శ్రీమతి షేర్ల నాగలక్ష్మి, ఇలా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు మహిళలతో పాటు పలువురికి సత్కారాలు అందజేశారు, ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా శ్రీమతి శ్రీవాణి రోహిత్ వ్యవహరించగా ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, కళా రత్న అవార్డు గ్రహీత శంకర్ నారాయణ, విశిష్ట అతిథులుగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్ వైస్ చైర్మన్ కళ్యాణ్ గారి పద్మ భాయ్ నర్సింగరావు మాజీ చైర్మన్ రాజమౌళి గౌరవ అతిథులుగా 20 వార్డ్ కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్ గోపాల్ రెడ్డి,వారి ఆత్మీయులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర గొప్పదని వారు అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తున్నారని గజ్వేల్ లో సాహిత్య సాంస్కృతి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న విశ్వేశ్వర రావును అభినందించారు, కళారత్నా శంకర్ నారాయణ మాట్లాడుతూ అమ్మ యొక్క గొప్పతనాన్ని వివరించారు, మహిళా లేనిదే మనిషికి మనుగడ లేదని సమాజ శ్రేయస్సులో మహిళల పాత్ర ముఖ్యమైనదని అన్నారు, విశ్వేశ్వరరావు మంజుల మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రతి సంవత్సరం ఇలాగే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, అమ్మకు వందనం అని అమ్మ లేనిదే మన జీవితం లేదని అన్నారు, ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ సంజయ్ గుప్తా,లయన్ నేతి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు,మరియు వసంత, అరుణ, రాజేశ్వర్ దివాకర్ రావు శ్రీనివాస్ రావు మధుసూదన్ రావు రోహిత్ రవీందర్ నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

# 3న స్వర్ణగిరి క్షేత్రం కవాట బంధనం...

**-కేతు గ్రహస్థ సంపూర్ణ చంద్రగ్రహణం...**
**-నేడు ఒక ప్రకటనలో తెలిపిన ఆలయ ప్రధాన అర్చకులు శ్రావణా చార్యులు...**



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 01** తెలంగాణలోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి యొక్క దివ్య క్షేత్రంలో కేతు గ్రహస్థ సంపూర్ణ చంద్ర గ్రహణాన్నీ పురస్కరించుకొని మార్చి మూడో తారీఖు నాడు ఆలయంలో స్వామివారి దర్శనాలంనింటిని భక్తులందరికీ నిలిపివేయడం జరుగుతుంది. మూడో తారీఖు సుప్రభాత సేవ స్వామివారి నిత్య కైంకర్యాలంటిని సంపూర్ణం చేసుకుని స్వామి వారి ఆలయాన్ని కవాట బంధనం చేయడం జరుగుతుంది. తదుపరి తేది 4 బుధవారం రోజున శుద్ధి పుణ్య ఆవాచన లాంటి కార్యక్రమాలు , ఆలయం ప్రాంగణం మొత్తం సంప్రోక్షణ చేసుకున్న పిదప మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుండి స్వర్ణగిరిషుని దర్శనాలు పునర్ ప్రారంభం చేయడం జరుగుతుందని స్వర్ణగిరి ఆలయ ప్రధాన అర్చకులు శ్రవణాచార్యులు నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

## మైలారం గ్రామంలో జూదం స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి: ఏడుగురు వ్యక్తుల అరెస్ట్, రూ. 3,93,820 నగదు స్వాధీనం



**గజ్వేల్ మార్చ్ 01 మన వార్త ప్రతినిధి** నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ బృందం, గౌరారం పోలీసులు ఆదివారం గౌరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మైలారం గ్రామంలో ఆకస్మిక దాడి నిర్వహించింది. గ్రామానికి చెందిన పిట్ల మధు ఇంట్లో అక్రమంగా “హెడ్ అండ్ టెయిల్స్“ (కాయిన్ టాసింగ్) జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో నిందితుల నుండి భారీగా నగదు మరియు ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల వివరాలు నగదు: రూ. 3,93,820/- మొబైల్ ఫోన్లు: 03 వాహనం: ఒక బాలెనో కారు (నెంబర్: TS07GM3348) నిందితుల వివరాలు: 1. పిట్ల మధు (33): తండ్రి: నర్సయ్య, వృత్తి: వ్యవసాయం, నివాసం: మైలారం (ఇంటి యజమాని మరియు నిర్వాహకుడు). 2. పెట్టరి సిద్దిరాములు (36): తండ్రి: భూమయ్య, నివాసం: దామరకుంట, వెల్దుర్తి మండలం, మెదక్ జిల్లా. 3. పెంజర్ల రాజేంద్ర ప్రసాద్ (37): తండ్రి: పర్వతాలు, నివాసం: దబీల్‌పూర్, మేడ్చల్ జిల్లా. 4. పోకల స్వామి (32): తండ్రి: నాగమల్లు, నివాసం: భరణ్‌పూర్, మర్కూక్ మండలం, సిద్దిపేట జిల్లా. 5. వడ్ల మహేందర్ (46): తండ్రి: భూమలింగం, నివాసం: అల్లాపూర్, తూప్రాన్ మండలం, మెదక్ జిల్లా. 6. భక్తుల యాదగౌడ్ (35): తండ్రి: నర్సగౌడ్, నివాసం: కాజిపేట, కోవాలిపల్లి మండలం, మెదక్ జిల్లా. 7. బొరెడ్డి దామోదర్ రెడ్డి (46): తండ్రి: నరసింహారెడ్డి, నివాసం: లింగాయపల్లి, కామారెడ్డి జిల్లా. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గౌరారం పోలీస్ స్టేషన్ ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలియజేశారు. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీ ప్రాంతంలో ఏదైనా అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లయితే, వెంటనే 8712667445, 8712667446, 8712667447 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించండి. మీ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలియజేశారు.

## భువనగిరి పురపాలక సంఘం సభ్యులకు అయ్యప్ప గుడిలో వేద ఆశీర్వచనం...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 01** నూతనంగా ఎన్నికైన భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ , వైస్ చైర్మన్ పొత్తంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు , మిగతా కౌన్సిల్ సభ్యులకు భువనగిరి పట్టణంలోని స్థానిక హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ ఆధ్వర్యంలో ఆదివారం రోజు వేద ఆశీర్వచనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అయిత రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులకు శాలువాలు , పూలదండలు వేసి సన్మానించారు. ప్రజలకు సేవాభావంతో పనిచేస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని వేద పండితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా నూతన మున్సిపల్ పాలకవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు , కార్యదర్శి దిడ్డి సత్యం నేత , ట్రెజరర్ శ్యాం సుందర్ ఘటాని , ప్రోగ్రాం చైర్మన్ గాదె శ్రీనివాస్ , కో-చైర్మన్ పోకల సోమన్న , ఆర్గనైజింగ్ సెక్రటరీ చీకటి మల్ల రాములు , మాజీ చైర్మన్లు మంచాల ప్రభాకర్ , బెల్లిదే వెంకటేష్ , పసుపు నూరి నాగభూషణం , మంచాల రిషికేష్ , చామ రవీందర్ , మంచుకొండ వినోద్ , చింత రవి , రావుల శ్రీధర్ , సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## పుష్కరాలకు పూసూరులో పుష్కర ఘాట్ ఏర్పాటు చేయాలి



**-నేతకాని హక్కుల పోరాట సమితి డిమాండ్..**

**వాజేడు మార్చి 1 మనవార్త** గోదావరి నది వద్ద 2027 సంవత్సరంలో జరుగానున్న పుస్కరల సందర్భంగా ములుగు జిల్లా వాజేడు మండలంలోనీ పూసూరు గ్రామం గోదావరి నది వద్ద పుస్కర ఘాట్ ఏర్పాటు చేయాలనీ చేయాలని నేతకాని హక్కుల పోరాట సమితి వాజేడు మండల యూత్ అధ్యక్షుడు జనగాం ప్రసాద్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరంతరం ప్రవహించే గోదావరి నది తీరాన ఉన్న పూసూరు గ్రామం భక్తులకు, స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండే అత్యుత్తమ ప్రదేశమని ఆయన పేర్కొన్నారు. భక్తులకు జాతీయ రహదారి, రవాణా సౌకర్యం, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉన్నాయని అందుబాటులో ఉన్న గ్రామాన్ని పక్కనబెట్టి, రవాణా సౌకర్యాలు లేని మారుమూల ప్రాంతాల్లో పుష్కరఘాట్ ఏర్పాటు చేయుటకు ప్రతిపదనలు జరుగుతున్నాయని అన్నారు. మండల అధికారులు, పార్టీ నాయకులు, జిల్లా అధికారులు సర్వేలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రజలకు నిజంగా ఉపయోగపడే ప్రదేశాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారనీ అన్నారు. పూసూరులో పుష్కరఘాట్ ఏర్పాటు చేస్తే భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం లభించడమే కాకుండా, స్థానిక వ్యాపారస్తులు, చిన్నచిన్న దుకాణదారులు, యువతకు ఉపాధి కలుగుతుందని, గ్రామ అభివృద్ధికి ఇది మైలురాయిగా నిలుస్తుంది. భవిష్యత్తులో కూడా ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా పూసూరు అభివృద్ధి చెందే అవకాశం ఉందనీ, ప్రయోజనాలను పక్కనబెట్టి నిర్ణయాలు తీసుకోవద్దు, తక్షణమే పూసూరు గోదావరి నదిని పరిశీలించి 2027 పుష్కరాలకు పూసూరులో పుష్కరఘాట్ నిర్మాణాన్ని చేయాలనీ అన్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి పారదర్శకంగా నిర్ణయం తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉన్న పూసూరు గ్రామ పంచాయితీలోనే పుష్కరఘాట్ ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు ఏకగళంగా విజ్ఞప్తి చేస్తున్నారు. 2027 గోదావరి పుష్కరాల సమయానికి పూసూరులో సకల సదుపాయాలతో కూడిన పుష్కరఘాట్ ఏర్పాటు చెయ్యాలని నేతకాని హక్కుల పోరాట సమితి మండల యూత్ నాయకులు జనగం. ప్రసాద్ రావు ప్రభుత్వన్నీ డిమాండ్ చేశారు.

## సిరికొండలో శ్రీ విష్ణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం




**నిజామాబాద్ జిల్లా సిరికొండ మన వార్త మార్చి 1** సిరికొండ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ స్కూల్లో శ్రీవిష్ణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డా. కె. రమణేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో న్యూరో ఫిజీషియన్, ఆర్థోపెడిక్ మరియు ఇతర నిపుణ వైద్యులు సేవలు అందించారు. రక్తపోటు, షుగర్ పరీక్షలు, ఈసీజీ , టుడికో, దగ్గు, దమ్ము, ఆస్తమా, గురుక, ఎలర్జీ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పరీక్షలు నిర్వహించి, ఎవరికి ఏ ప్రాబ్లం ఉన్నదో తెలుసుకొని వారికి కావలసిన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ఆరోగ్య సేవలు సద్విని సద్వినియోగం చేసుకున్నారు.

# పెద్దాపూర్ ప్రైవేట్ గోదాంలో ఆగ్రో సొసైటీ యూరియా..?

**-100 బ్యాగులు మాత్రమే ఆన్లైన్లో మిగతా బ్యాగులన్నీ బ్లాక్ లోనే....**
**-నాగర్ కర్నూల్ జిల్లా ఏవో సహకారంతో యూరియా దారి మళ్లింపు...**



**తెలంగాణస్టేట్ బ్యూరో, భాస్కర్ చారి, మార్చి 1, మనవార్త.** నాగర్ కర్నూల్ జిల్లా పెద్దాపూర్ లో యూరియా దందా జోరుగా కొనసాగుతుంది. నాగర్ కర్నూల్ అగ్రికల్చర్ ఆఫీసర్ సహకారంతోనే గుడిపల్లి ఆగ్రో సొసైటీ కేంద్రంలో ఉండాల్సిన యూరియా లోడ్ పెద్దాపూర్ ప్రైవేట్ గోదాంలో దింపుకొని బ్లాక్లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్న ఆగ్రో సొసైటీ యజమాని. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని రాత్రి అలాగే ఉదయం 4 గంటల నుండి 7 గంటల వరకు పెద్దాపూర్ గోదాంలో ఉన్న యూరియాను ప్రభుత్వం నిర్ణయించిన ధర కాకుండా ఒక్కో బ్యాగు పై తన ఇష్ట రాజ్యంగా 400, 500 చొప్పున బ్లాక్లో అమ్ముకుంటూ రైతులను మోసం చేస్తున్న గుడిపల్లి ఆగ్రో సొసైటీ యజమాని. ఆగ్రో సొసైటీలో దింపాల్సిన యూరియాలోడు పక్కదారి మళ్లించడంలో నాగర్ కర్నూల్ జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ అండదండలు ఉన్నట్టు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆగ్రో సొసైటీలో రైతులకు యూరియా విక్రయించే సమయంలో అక్కడ అగ్రికల్చర్ ఆఫీసర్ కానీ దానికి సంబంధించిన సంబంధిత అధికారులు కానీ ఎవరో ఒకరు ఉండాల్సిన నిబంధన ఉంది. కానీ ఇలాంటి నిబంధనలు ఏవి లెక్కచేయకుండా ఏవో సహకారంతో ఆగ్రో సొసైటీ యజమాని తన ఇష్టారాజ్యంగా బ్లాక్లో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడని పలు గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన యూరియా లోడు మొత్తం ఆన్లైన్లో రైతులు బుక్ చేసుకుని తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ప్రభుత్వం నుంచి వచ్చిన 350 బ్యాగులకు 100 బ్యాగులను మాత్రమే ఆన్లైన్లో చూపించి మిగతా బ్యాగులను బ్లాక్లో అమ్ముకుంటున్నారని రైతులు విమర్శిస్తున్నారు. అసలే యూరియా దొరకక రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే రైతుల బాధలు లెక్కచేయకుండా వారి అవసరాలను ఆసరాగా తీసుకొని అగ్రికల్చర్ ఆఫీసర్ అలాగే ఆగ్రో సొసైటీ యజమాని ఇద్దరూ కలిసి బ్లాక్లో యూరియాను విక్రయించడంపై రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నుంచి వచ్చిన యూరియాలోడును ఆగ్రో సొసైటీ కేంద్రంలోనే దింపాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే విక్రయించాలని, లేనిచో జిల్లా కలెక్టర్ కి, అవసరమైతే వ్యవసాయ శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

## అమరుడు పులివెందుల దేవయ్య కుమారుని పెళ్లికి వచ్చిన బంజారా మండల అధ్యక్షుడు రూప్ సింగ్ నాయక్

**-పులివెందుల అమరుడు దేవయ్య కుటుంబానికి బంజారా సంఘం అండ...**



**నిజామాబాద్ జిల్లా సిరికొండ ( మన వార్త) మార్చి 1** సిరికొండ మండలం పాకాల గ్రామానికి చెందిన అమరుడు పులివెందుల దేవయ్య ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొని సేవలందించిన వ్యక్తి అని బంజారా సిరికొండ మండల అధ్యక్షుడు రూప్ సింగ్ నాయక్ పేర్కొన్నారు. మూడు సంవత్సరాల క్రితం దేవయ్య తల్లి మరణించగా, ఇటీవల నిర్వహించిన రిసెప్షన్ కార్యక్రమంలో రూప్ సింగ్ నాయక్ హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “దేవయ్య కుటుంబానికి ఎల్లప్పుడూ నేను నాతో పాటు మా బంజారా సంఘం ఏ ఆపద వచ్చినా అండగా ఉంటాం అని సిరికొండ మండల అధ్యక్షుడు రూప్సింగ్ నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బంజారా సంఘం నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ కు ఘన సన్మానం..



**జమ్మికుంట, మార్చి 01( మన వార్త ప్రతినిధి):** ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మెన్ ను ఆదివారం ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ మొలుగురి ప్రశాంత్ (దిలీప్) ను స్థానిక వర్తక సంఘంలో సంఘం సభ్యులు శాలువాలు, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రజలకు సేవ చేయాలని, పట్టణ అభివృద్ధి కోసం కృషి చేయాలని సంఘం ప్రతినిధులు ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు తమపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అయిత మహేష్, పాపయ్య, శివ శంకర్, కౌన్సిలర్లు బచ్చు మాధవి, చుంచు రమ, చందా రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చరిత్రలో ఒక మైలురాయి..



**-ఇన్చార్జి ప్రణవ్...**

**జమ్మికుంట, మార్చి 01( మన వార్త ప్రతినిధి):** పేద వారి సొంతంటి కల కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని, ఇప్పటికే మొదటి దశలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లలు మంజూరు అయ్యాయని రానున్న రోజుల్లో మరిన్ని ఇళ్లు కేటాయించి అర్హులైన అందరికి ఇల్లు కేటాయిస్తామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ఆదివారం రోజున జమ్మికుంట మండల పరిధిలోని మడిపల్లి గ్రామంలో కొమ్ము స్వప్న-రమేష్ లబ్ధిదారుని ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారున్ని శాలువాతో ఘనంగా సన్మానించారు ప్రణవ్. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్లలో బిఆర్ఎస్ పార్టీ ఒక్క ఇంటిని కూడా నిరుపేదలైన వారికి అందజేయలేదని, కనీసం కట్టిన ఇళ్లను కూడా పంచలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అంటే పేదల పార్టీ అని రానున్న రోజుల్లో మరిన్ని ఇళ్ల కేటాయింపుకు ముఖ్యమంత్రి, మంత్రుల సహకారంతో మరిన్ని ఎక్కువ ఇల్లులు నియోజకవర్గానికి మంజూరు అయ్యేలా కృషి చేస్తాననీ అన్నారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి గ్రామ సర్పంచ్ మ్యాకమల్ల తిరుమల-వెంకటేష్, మార్కెట్ డైరెక్టర్ సదానందం, మాజీ ఎంపీపీ నేరేళ్ల రాజమల్లు గౌడ్, వార్డు సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైస్ చైర్మన్ జావిద్ ను సన్మానించిన ఆటో డ్రైవర్లు..



**జమ్మికుంట, మార్చి 01( మన వార్త ప్రతినిధి):** జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ ( జావిద్ )ను ఆదివారం కొత్తపల్లి మడిపల్లి చౌరస్తా ఆటో యూనియన్ సభ్యులు తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ జావిద్, మాట్లాడుతూ స్త్రీలకు ఫ్రీ బస్సు పథకం అమలు అయిన రోజు నుండి ఆటో డ్రైవర్ల పరిస్థితి దీనంగా మారిందని కడు బీదరికంలో ఉండే ఆటో డ్రైవర్లు రెక్కాడితే గాని కడుపు నిండని పరిస్థితుల్లో ఉన్నారని ప్రభుత్వపరంగా ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని. అర్హులైన ఆటో డ్రైవర్లకు ఇందిరమ్మ ఇల్లు డబల్ బెడ్ రూమ్లు సౌకర్యం కల్పించాలని. తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఆటో డ్రైవర్ల పై ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ పి. శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ కే. శ్రీనాథ్, క్యాషియర్ కుమార్, మాజీ ప్రెసిడెంట్ ఎండి. హబీబ్ పాషా, రామారావు, మల్లేష్, రమేష్, డి. శ్రీనివాస్ సురేష్, మామిడి రాజేందర్, తదితరులు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# ‘వేద‘ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన..



**జమ్మికుంట, మార్చి 01( మన వార్త ప్రతినిధి):** జమ్మికుంట వీణవంక రోడ్డులోని ఎస్బీఐ బ్యాంకు పక్కన ఉన్న ‘వేద‘ కంటి, చెవి, ముక్కు, గొంతు ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి పట్టణ ప్రజల నుండి విశేష స్పందన లభించింది. సుమారు 200 మంది బాధితులు ఈ శిబిరానికి విచ్చేయగా, ఆసుపత్రి నిర్వాహకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ టి. వెంకట్ సాయి నేత్ర (నేత్ర వైద్య నిపుణులు), డాక్టర్ ఎస్. నిఖిత (ఈఎన్‌టీ నిపుణులు) దంపతులు రోగులకు ఉచితంగా ఓపీ పరీక్షలు నిర్వహించి తగిన వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి నేత్ర మాట్లాడుతూ, కళ్ళు ఎర్రబడటం, కంటి నుండి నీరు కారడం, గ్లకోమా, క్యాటరాక్ట్ వంటి సమస్యలతో వచ్చిన వారికి క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహించి చికిత్స అందించినట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ నిఖిత మాట్లాడుతూ, చెవి నొప్పి, వినికిడి సమస్యలు, వివిధ రకాల అలర్జీలతో బాధపడుతున్న వారికి అవసరమైన వైద్య సేవలందించామని పేర్కొన్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా సేవా దృక్పథంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు వైద్య బృందం వెల్లడించింది.

# ఉదయం ఖాళీ కడుపుతో

## బొప్పాయి ఆరోగ్యానికి సహజ వరం



**డెస్క్,** ప్రస్తుతం ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతున్న నేపథ్యంలో చాలామంది ఉదయం అల్పాహారంగా పండ్లను తీసుకోవడం అలవాటు చేసుకుంటున్నారు. వాటిలో బొప్పాయి ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. నిపుణుల సూచనల ప్రకారం ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే జీర్ణక్రియను వేగవంతం చేసే సహజ రసాలు ఆహారంలోని ఘన పోషకాలను సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. దీంతో రోజంతా కడుపు తేలికగా ఉండి శక్తివంతంగా పనిచేయగలుగుతుంది. బొప్పాయిలో పీచు పదార్థం, నీటి శాతం అధికంగా ఉండటం వల్ల పేగుల కదలికలు మెరుగుపడతాయి. దీని వల్ల మలబద్ధకం సమస్య సహజంగానే తగ్గుతుంది. కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి ఇబ్బందులు తగ్గి జీర్ణవ్యవస్థ సమతుల్యంగా పనిచేస్తుంది. ప్రతిరోజూ బొప్పాయి తీసుకునే వారిలో కడుపు శుభ్రత మెరుగ్గా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. బొప్పాయిలో కేలరీలు తక్కువగా ఉండటంతో పాటు తిన్న వెంటనే కడుపు నిండిన భావన కలుగుతుంది. అందువల్ల అధికంగా తినే అలవాటు తగ్గి బరువు నియంత్రణలో ఉంటుంది. గ్యాస్, ఆమ్లత్వం వంటి సమస్యలు తగ్గుతాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి ఎంపికగా భావించబడుతోంది. శరీరానికి అవసరమైన రోగనిరోధక శక్తిని పెంపొందించే తత్వాలు కూడా ఇందులో సమృద్ధిగా ఉన్నాయి. బొప్పాయిలో ఉండే పీచు పదార్థం, ఖనిజ లవణాలు రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. రక్తంలో పేరుకునే చెడు కొవ్వు పదార్థాన్ని తగ్గించి హృదయ సంబంధ సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. అలాగే ఇందులోని కణ రక్షక లక్షణాలు చర్మాన్ని మెరిసేలా ఉంచి వృద్ధాప్య ఛాయలను ఆలస్యంగా రానిస్తాయి. అందువల్ల ఉదయం అల్పాహారంగా బొప్పాయి తీసుకోవడం ద్వారా ఆరోగ్యంతో పాటు అందాన్ని కూడా కాపాడుకోవచ్చు.

# పచ్చి మాంసం నిర్వహణలో నిర్లక్ష్యం ప్రమాదకరం





**డెస్క్,** పచ్చి మాంసంలో హానికర సూక్ష్మక్రిములు అధికంగా ఉండే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చికెన్ లేదా మటన్‌ను దుకాణం నుంచి తీసుకొచ్చి వంటగదిలో కొంతసేపు అలాగే ఉంచితే ఆ సమయంలోనే సూక్ష్మక్రిములు పాత్రలు, పలకలు, కత్తులు వంటి ఉపరితలాలపై వ్యాపించే ప్రమాదం ఉంటుంది. ఇవి కంటికి కనిపించకపోయినా ఆహార భద్రతకు ముప్పు కలిగించవచ్చు. అందువల్ల మాంసాన్ని ఇంట్లోకి తీసుకురాకముందే బయట శుభ్రంగా కడిగి, వేరుగా మూతపెట్టిన పాత్రలో ఉంచి వంటగదిలో పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. పచ్చి మాంసం ఇతర ఆహార పదార్థాలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరం. మాంసం వండేటప్పుడు పూర్తిగా ఉడికేలా చూసుకోవాలి. సరైన ఉష్ణోగ్రతకు ఉడికించకపోతే కొన్ని హానికర క్రిములు జీవించి ఉండే అవకాశం ఉంది. మాంసాన్ని వండే ముందు ఒకటి రెండు సార్లు శుభ్రంగా కడగడం, వేరే పలకపై కట్ చేయడం, వాడిన పాత్రలను వెంటనే సబ్బుతో శుభ్రం చేయడం మంచిది. మంటపై బాగా ఉడికిస్తే చాలా సూక్ష్మక్రిములు నశిస్తాయి. అయితే వంటగదిలో శుభ్రత పాటించకపోతే మళ్లీ కాలుష్యం కలగవచ్చు. అల్లం, వెల్లుల్లి, మసాలా దినుసులు వాడటం వలన కొంతవరకు హానికర క్రిముల పెరుగుదల తగ్గుతుందని చెబుతున్నప్పటికీ ఇవి పూర్తిస్థాయి రక్షణ కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కాబట్టి మాంసాహార వంటకాల తయారీలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. చేతులను సబ్బుతో బాగా కడుక్కోవడం, వాడిన పలకలు, కత్తులు శుభ్రం చేయడం వంటి చర్యలు అనారోగ్యాన్ని దూరం చేస్తాయి. చికెన్, మటన్ వంటి మాంసాహారాల్లో శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, పోషకాలు ఉన్నప్పటికీ వాటి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రమాదకరం. సరైన శుభ్రత, పూర్తిగా ఉడికించడం, వంటగదిలో క్రమబద్ధమైన పద్ధతులు పాటించడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చు. ఈ సమాచారం అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సంబంధిత సందేహాలు ఉంటే వైద్య నిపుణులను సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు.

# ఖాళీ కడుపుతో పాలుడ లాభాలా నష్టాలా?



**డెస్క్,** ఖాళీ కడుపుతో పాలు తాగడం ఆరోగ్యానికి మంచిదా కాదా అనే ప్రశ్నపై విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. కొందరికి ఉదయం పూట పాలు తాగితే కడుపు నిండిన భావన కలిగి శక్తి స్థాయిలు పెరుగుతాయి. అయితే మరికొందరికి అదే పాలు ఉబ్బరం, గ్యాస్, ఆమ్లత్వం వంటి సమస్యలను కలిగిస్తాయి. జీర్ణవ్యవస్థ సున్నితంగా ఉండే వారు ఖాళీ కడుపుతో పాలు తాగితే అసౌకర్యం ఎదురయ్యే అవకాశం ఉంది. అలాంటి వారు పాలలో ఓట్స్ లేదా ఇతర గింజలను ఒక చెంచా మోతాదులో కలిపి తీసుకుంటే జీర్ణక్రియ నెమ్మదించి కడుపులో ఇబ్బంది తగ్గుతుందని వైద్యులు సూచిస్తున్నారు. పాలలో ప్రోటీన్ సమృద్ధిగా ఉండటం వల్ల కండరాల పెరుగుదలకు, మరమ్మత్తుకు ఇది సహాయపడుతుంది. అయితే పాలు తాగితే వెంటనే శరీర జీవక్రియ పెరుగుతుందనే భావన అపోహ మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. జీవక్రియను పెంచాలంటే సమతుల్య ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, తగినంత నీరు తీసుకోవడం అవసరం. బరువు తగ్గాలనుకునే వారు ఉదయం ఖాళీ కడుపుతో కాకుండా వ్యాయామానికి సమీప సమయంలో పాలు తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. గోరువెచ్చని పాలు ఆమ్లత్వాన్ని తగ్గిస్తాయని చాలామంది నమ్ముతారు. తాత్కాలిక ఉపశమనం కలిగించినా పూర్తి కొవ్వు పాలు కొన్నిసార్లు ఆమ్ల ఉత్పత్తిని ప్రేరేపించవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తరచుగా ఆమ్లత్వం వచ్చే ధోరణి ఉన్నవారు తక్కువ కొవ్వు ఉన్న పాలు తాగడం లేదా ఖాళీ కడుపుతో పాలు తీసుకోకపోవడం మంచిదని చెబుతున్నారు. అలాగే కేవలం పాలను మాత్రమే అల్పాహారంగా తీసుకోవడం సరైన పద్ధతి కాదు. పాలు తీసుకునేటప్పుడు చియా గింజలు, ఓట్స్, అరటిపండు వంటి పోషక పదార్థాలను కలిపి తీసుకుంటే మంచిది. పాలు తాగితే నిద్ర బాగా వస్తుందనే నమ్మకంతో కొందరు ఉదయం పూటే పాలు తాగుతుంటారు. పాలలో నిద్రకు సహాయపడే తత్వం ఉన్నప్పటికీ అది స్థిరంగా పనిచేయదు. నిద్ర బాగా పట్టాలంటే రాత్రి పడుకునే ముందు అరగంట నుంచి గంట ముందే పాలు తాగడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే పాలు మాత్రమే తాగితే ఎముకలు బలంగా తయారవుతాయని భావించడం కూడా సరైనది కాదు. విటమిన్ డి తో పాటు ఇతర పోషకాలు కూడా సమతుల్యంగా అందితేనే కాల్షియం శరీరానికి సరిగ్గా ఉపయోగపడుతుంది. మొత్తంగా పాలు ఆరోగ్యానికి మేలు చేసినా ఖాళీ కడుపుతో తాగాలా వద్దా అనే విషయం ప్రతి ఒక్కరి శరీర స్వభావాన్ని బట్టి నిర్ణయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# కోడిగుడ్డు పచ్చసొన కొలెస్ట్రాల్ భయమా పోషక శక్తామా?



**డెస్క్,** కోడిగుడ్డు సంపూర్ణ పోషకాహారంగా వైద్యులు సూచించే ఆహారాల్లో ఒకటి. అయితే గుడ్డు పచ్చసొన తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందనే భయంతో చాలామంది దానిని మానేస్తున్నారు. పరిశోధనల ప్రకారం పచ్చసొనలో కొలెస్ట్రాల్ ఉండటం వాస్తవమే అయినప్పటికీ ఆహారం ద్వారా వచ్చే కొలెస్ట్రాల్ ప్రతి ఒక్కరిలోనూ రక్తంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచదు. ఆరోగ్యంగా ఉన్నవారు రోజుకు ఒక పూర్తి గుడ్డు తీసుకున్నా పెద్దగా ప్రమాదం ఉండదని నిపుణులు చెబుతున్నారు. పచ్చసొనలో కేవలం కొవ్వు మాత్రమే కాదు, విటమిన్ ఏ, డి, ఈ, బి పన్నెండు వంటి ముఖ్యమైన పోషకాలు కూడా ఉంటాయి. అలాగే ఇనుము, కాల్షియం, జింక్ వంటి ఖనిజాలు శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ఎముకల బలానికి, రోగనిరోధక శక్తి పెంపుకు ఇవి తోడ్పడతాయి. పచ్చసొనలో ఉండే కోలిన్ అనే పోషకం మెదడు పనితీరును మెరుగుపరచడంలో, జ్ఞాపకశక్తి పెంపులో కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే పెరుగుతున్న పిల్లలకు గుడ్డు ఇవ్వడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. పచ్చసొనలో లూటిన్, జియాక్సంతిన్ వంటి కణ రక్షక గుణాలు ఉన్నాయి. ఇవి వయస్సు పెరిగేకొద్దీ వచ్చే కంటి సమస్యలను తగ్గించి చూపును మెరుగుపరచడంలో సహాయపడతాయి. సాధారణ వ్యక్తులు రోజుకు ఒక పూర్తి గుడ్డు తీసుకోవడం సురక్షితం. అధిక శారీరక శ్రమ చేసే వారు లేదా వ్యాయామం చేసే వారు వైద్యుల సలహాతో అవసరానికి అనుగుణంగా మోతాదును పెంచుకోవచ్చు. గుడ్డును ఉడకబెట్టి తినడం అత్యంత ఆరోగ్యకరం. అధిక నూనె, ఉప్పు, మసాలాలు కలిపి తయారుచేసే వంటకాల్లో గుడ్డు ప్రయోజనాలు కొంతవరకు తగ్గే అవకాశం ఉంది. గుండె సంబంధ వ్యాధులు, అధిక కొలెస్ట్రాల్ లేదా మధుమేహం ఉన్నవారు పచ్చసొన విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అలాంటి వారు తప్పనిసరిగా వైద్యుల సలహా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమాచారం అవగాహన కోసం మాత్రమే; ఆరోగ్య సమస్యలు ఉన్నవారు నేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం ఉత్తమం.

## ఓపెన్ ఏఐలో అమెజాన్ భారీ పెట్టుబడి




**సియాటిల్** ప్రపంచ సాంకేతిక రంగంలో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ప్రముఖ అమెరికన్ టెక్ దిగ్గజం అమెజాన్, కృత్రిమ మేధస్సు రంగంలో దూసుకుపోతున్న ఓపెన్ ఏఐలో రికార్డు స్థాయి పెట్టుబడిని ప్రకటించింది. తాజా నిధుల సమీకరణలో భాగంగా అమెజాన్ ఏకంగా 50 బిలియన్ డాలర్లకు సమానమైన సుమారు రూ.4.55 లక్షల కోట్లను వెచ్చించడం విశేషం. ఒకే సంస్థలో అమెజాన్ ఇప్పటివరకు పెట్టిన అతిపెద్ద పెట్టుబడి ఇదే కావడం గమనార్హం. ఈ భారీ ఒప్పందంతో ఓపెన్ ఏఐ మార్కెట్ విలువ అమాంతం 840 బిలియన్ డాలర్లకు పెరిగినట్లు సమాచారం. కేవలం అమెజాన్ మాత్రమే కాకుండా జపాన్‌కు చెందిన పెట్టుబడి దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ మరియు చిప్ తయారీ రంగంలో అగ్రగామిగా నిలిచిన ఎన్విడియా కూడా చెరో 30 బిలియన్ డాలర్ల చొప్పున పెట్టుబడులు పెట్టడం ద్వారా ఈ నిధుల సమీకరణను చారిత్రాత్మకంగా మార్చాయి. ఈ ఒప్పందంలో భాగంగా ఓపెన్ ఏఐ తన సొంత కృత్రిమ మేధస్సు చిప్ వ్యవస్థను విస్తృతంగా వినియోగించనుండగా, అమెజాన్ మౌలిక వసతుల విభాగమైన అమెజాన్ వెబ్ సర్వీసెస్ ద్వారా వచ్చే ఎనిమిదేళ్లలో మరింత భారీ స్థాయిలో డేటా కేంద్రాలు, కంప్యూటింగ్ శక్తి విస్తరణకు అదనంగా 100 బిలియన్ డాలర్లను ఖర్చు చేయనున్నట్లు వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ పెట్టుబడులు సాంకేతిక రంగ దిశను మార్చే నిర్ణయాలుగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆరోగ్యం, విద్య, రక్షణ, వాణిజ్యం వంటి అనేక రంగాల్లో కృత్రిమ మేధస్సు ప్రభావం మరింత విస్తరించే అవకాశముండగా, అమెజాన్ ఓపెన్ ఏఐ భాగస్వామ్యం ప్రపంచ సాంకేతిక పోటీలో కొత్త సమీకరణాలకు దారితీయనుందని నిపుణులు భావిస్తున్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చికెన్ ధరలు



**హైదరాబాద్** తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ప్రియులకు చేదు వార్త అందుతోంది. మార్కెట్లో కోడి మాంసం ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగి ట్రిపుల్ సెంచరీ దిశగా దూసుకెళ్తున్నాయి. వేసవి తీవ్రత పెరగడం, ఉత్పత్తి తగ్గడం వంటి కారణాలతో ధరలు సామాన్యుడికి అందని స్థాయికి చేరుతున్నాయి. ముఖ్యంగా స్కిన్‌లెస్ చికెన్ ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా పెరగడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్లో ప్రస్తుతం కేజీ స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.280 నుంచి రూ.300 వరకు పలుకుతోంది. ఇదే పరిస్థితి ఆంధ్రప్రదేశ్ నగరాల్లోనూ కనిపిస్తోంది. విశాఖపట్నంలో కిలో ధర రూ.300 మార్కును తాకగా, విజయవాడలో రూ.270 వరకు, గుంటూరు ప్రాంతంలో సుమారు రూ.250 వరకు విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో డిమాండ్ అధికంగా ఉండటంతో ధరలు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ధరలు పెరగడానికి ప్రధాన కారణంగా ఎండల తీవ్రతను వ్యాపారులు చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో కోళ్ల మరణాల శాతం పెరిగి సరఫరా తగ్గింది. అదనంగా పౌల్ట్రీ ఫామ్‌ల నిర్వహణ ఖర్చులు, దాణా ధరల పెరుగుదల కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. ఆదివారాల్లో చికెన్ సెంటర్ల వద్ద క్యూలు కనిపించేవి, ఇప్పుడు పెరిగిన ధరల కారణంగా వినియోగదారులు తక్కువ పరిమాణంలో కొనుగోలు చేస్తూ సరిపెట్టుకుంటున్నారు. ధరలు ఇలాగే కొనసాగితే హోటళ్లలో చికెన్ వంటకాల ధరలు కూడా పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

## హోలీ పండుగ వేళ పెరిగిన గ్యాస్ ధరలు



**హైదరాబాద్** హోలీ పండుగ సమీపిస్తున్న వేళ సామాన్యులు, వ్యాపారులకు చమురు సంస్థలు షాక్ ఇచ్చాయి. వాణిజ్య అవసరాల కోసం వినియోగించే 19 కిలోల గ్యాస్ సిలిండర్ ధరలను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకున్నాయి. దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన ఈ పెంపు వరుసగా మూడో నెల కొనసాగడం గమనార్హం. పండుగ సీజన్‌లోనే ధరలు పెరగడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ రంగాలపై అదనపు భారం పడనుంది. తాజా సవరణ ప్రకారం 19 కిలోల వాణిజ్య సిలిండర్‌పై సుమారు రూ.28 నుంచి రూ.31 వరకు పెరుగుదల చోటుచేసుకుంది. మరోవైపు గృహ వినియోగదారులకు కొంత ఊరటనిస్తూ 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ప్రస్తుతం హైదరాబాద్‌లో గృహ వినియోగ సిలిండర్ ధర రూ.905 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. అయితే వాణిజ్య సిలిండర్ ధరలు పెరగడం వల్ల బయట దొరికే ఆహార పదార్థాల ధరలపై పరోక్ష ప్రభావం పడే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. గత మూడు నెలలుగా వాణిజ్య గ్యాస్ ధరలు నిరంతరం పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల మార్పులు, డిమాండ్ సరఫరా పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ధరలను సవరించినట్లు చమురు సంస్థలు పేర్కొంటున్నాయి. గృహ వినియోగదారులకు ధరల స్థిరత్వం తాత్కాలిక ఉపశమనం ఇచ్చినప్పటికీ, వ్యాపార రంగంపై పెరుగుతున్న ఖర్చులు చివరకు వినియోగదారులపై పడే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పండుగ వేళ ఇలాంటి భారాలు సామాన్యుల బడ్జెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

## బంగారం ధరలకు రెక్కలు



**హైదరాబాద్** ఇరాన్పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బంగారం ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. శనివారం నుంచి పసిడి ధరలు భారీగా పెరుగుతూ కొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. యుద్ధ భయాందోళనలు పెరగడంతో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గు చూపడం వల్ల బంగారం కొనుగోళ్లు పెరిగాయి. దీంతో పది గ్రాముల బంగారం ధర రూ.1.73 లక్షలను దాటి, త్వరలోనే రూ.2 లక్షల మార్కును అందుకునే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అలాగే వెండి ధరలు కూడా గణనీయంగా పెరుగుతూ మూడు లక్షల మార్కును దాటాయి. ఈ రోజు ఉదయం 11:30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,73,080కు చేరుకుంది. నిన్నటి ధరతో పోలిస్తే సుమారు రూ.4,300 పెరుగుదల నమోదైంది. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,58,650 వద్ద కొనసాగుతోంది. ఇదే సమయంలో దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.1,73,230కు చేరుకోగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,58,800 వద్ద ఉంది. వెండి విషయానికి వస్తే హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.3.25 లక్షలకు చేరగా, ఢిల్లీలో అది రూ.2.95 లక్షలుగా నమోదైంది. యుద్ధ పరిస్థితులు కొనసాగితే బంగారం, వెండి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# 'టాక్సిక్' నుంచి 'తబాహి' యశ్ కియారా జంట హిట్




**హైదరాబాద్** పాన్ ఇండియా స్టార్ యశ్, బాలీవుడ్ నటి కియారా అద్వానీ జంటగా నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా టాక్సిక్ నుంచి తాజాగా విడుదలైన పోస్టర్లు సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నాయి. దర్శకురాలు గీతూ మోహన్ దాస్ రూపొందిస్తున్న ఈ చిత్రంలో తొలి పాటగా రాబోతున్న 'తబాహి'కు సంబంధించిన రొమాంటిక్ పోస్టర్లు అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేశాయి. మార్చి 2న మధ్యాహ్నం 12 గంటల 59 నిమిషాలకు 'తబాహి' పాటను విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదలైన పోస్టర్‌లో యశ్ షర్ట్‌లెస్ లుక్‌లో స్టైలిష్‌గా కనిపిస్తుండగా, కియారా అద్వానీ ఆయనను బిగిగా ఆలింగనం చేసిన దృశ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సముద్ర తీరంలో సూర్యాస్తమయం వేళ వీరిద్దరి మధ్య కనిపించిన రొమాంటిక్ కెమిస్ట్రీ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. అభిమానులు ఈ జంటను ఇప్పటికే సూపర్ హిట్ జంటగా అభివర్ణిస్తున్నారు. ఈ చిత్రంలో యశ్ 'రాయ' అనే శక్తివంతమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటిస్తుండగా, కియారా 'నదియా' పాత్రలో మెప్పించనుంది. వీరితో పాటు నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 1940 నుంచి 1970 మధ్య గోవా నేపథ్యంలో సాగే గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు సమాచారం. యశ్ గత చిత్రాల తర్వాత ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. స్టైలిష్ యాక్షన్, రొమాన్స్, కాలపరిమితి నేపథ్యం కలిసి 'టాక్సిక్'ను ప్రత్యేక చిత్రంగా నిలబెట్టనున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. 'తబాహి' పాట విడుదలతో ఈ చిత్ర ప్రమోషన్లు మరింత వేగం అందుకోనున్నాయి. సోషల్ మీడియా ఇప్పటికే ఈ పోస్టర్లతో హీటెక్కిపోతుండగా, పాట విడుదల తర్వాత ఈ హైప్ మరింత పెరిగే అవకాశం ఉందని అభిమానులు అంటున్నారు.

# వన్డే సిరీస్‌లో భారత్‌కు ఘోర పరాభవం




**సిడ్నీ** వన్డే ప్రపంచ కప్ విజేతగా వెలుగొందిన భారత మహిళల జట్టుకు ఆస్ట్రేలియా పర్యటనలో చేదు అనుభవం ఎదురైంది. భారత మహిళల క్రికెట్ జట్టు పొట్టి ఫార్మాట్‌లో విజయాన్ని అందుకున్నప్పటికీ, వన్డే సిరీస్‌లో మాత్రం పూర్తిగా విఫలమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆతిథ్య ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు 3–0 తేడాతో కైవసం చేసుకుని భారత్‌ను వైట్‌వాష్ చేసింది. మూడో వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు భారత బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయించింది. కెప్టెన్ అలీసా హీలీ అద్భుత శతకం సాధించి 158 పరుగులతో జట్టుకు బలమైన పునాది వేశారు. ఆమెకు తోడుగా అనాబెల్ సథర్‌లాండ్ 106 పరుగులతో మెరుపులు మెరిపించడంతో ఆస్ట్రేలియా 409 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. భారత బౌలర్లు ఎక్కడా కట్టడి చేయలేకపోవడంతో ఆసీస్ బ్యాటర్లు స్వేచ్ఛగా ఆడారు. 410 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. ఓపెనర్ స్మృతి మంధాన ఖాతా తెరవకముందే ఔటవ్వడంతో ఒత్తిడి పెరిగింది. ప్రతీకా రావల్ కొంతసేపు నిలిచినా పెద్ద స్కోరు చేయలేకపోయింది. ఆ తర్వాత జెమీమా రోడ్రిగ్స్ 42 పరుగులు చేసి పోరాటం చేసినా, కీలక సమయంలో ఔటవడంతో భారత్ కుదేలైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 25 పరుగులకే పరిమితమవడంతో మధ్యవరుస పూర్తిగా కూలిపోయింది. లోయర్ ఆర్డర్‌లో రిచా గోష్, హర్లీన్ డియోల్ తలా కొంతసేపు పోరాడినా లక్ష్యం చాలా దూరంగా ఉండటంతో ఒత్తిడిని తట్టుకోలేకపోయారు. చివర్లో స్నేహ్ రానా 44 పరుగులతో కాస్త మెరుగైన ఇన్నింగ్స్ ఆడినా ఫలితం మారలేదు. భారత ఇన్నింగ్స్ 224 పరుగులకే ముగియడంతో ఆస్ట్రేలియా 185 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ పరాజయంతో వన్డే సిరీస్‌ను 3–0తో కోల్పోయిన భారత్‌కు ఇది గట్టి హెచ్చరికగా మారింది. పొట్టి ఫార్మాట్‌లో చూపిన ధాటిని వన్డేల్లో కొనసాగించలేకపోవడం జట్టు బలహీనతలను బయటపెట్టింది. ముఖ్యంగా బౌలింగ్ విభాగం పూర్తిగా విఫలమవడం, భారీ లక్ష్యాల ముందు బ్యాటింగ్ వరుస ఒత్తిడికి లోనవడం ఆందోళన కలిగిస్తోంది. రాబోయే అంతర్జాతీయ టోర్నీలకు ముందు ఈ లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

# 'ది కేరళ స్టోరీ 2'పై మిశ్రమ స్పందన




**హైదరాబాద్** 2023లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ది కేరళ స్టోరీకి కొనసాగింపుగా రూపొందిన ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్ ఫిబ్రవరి 27, 2026న థియేటర్లలోకి వచ్చింది. హింస, మత మార్పిడి, మోసం వంటి అంశాలను కేంద్రంగా తీసుకుని రూపొందిన ఈ చిత్రం విడుదలైన మొదటి రోజే చర్చలకు దారి తీసింది. అయితే ఈసారి కథనం మరింత తీవ్ర స్వరాన్ని అందుకున్నట్లు సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ చిత్రంలో కొచ్చి, జోధ్‌పూర్, గ్వాలియర్ ప్రాంతాలకు చెందిన ముగ్గురు యువతుల కథను చూపించారు. ప్రేమ పేరుతో మోసం, బలవంతపు మత మార్పిడి, అక్రమ రవాణా వంటి కోణాల చుట్టూ కథనం సాగుతుంది. జర్నలిస్ట్, భర్త, నవవధువు వంటి పాత్రలు కూడా అదే నేపథ్యంతో ముడిపడి ఉండటంతో సినిమా మొత్తం ఒకే భావజాలాన్ని బలంగా ప్రతిబింబించినట్లు కనిపిస్తుంది. సహజసిద్ధమైన కేరళ అందాలు, సంస్కృతి కంటే సంఘటనల తీవ్రతకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్టు ప్రేక్షకులు వ్యాఖ్యానిస్తున్నారు. దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్, రచయిత విపుల్ అమృత్ లాల్ షా తొలి భాగంలో ఉన్న వివాదాస్పద అంశాలను ఈ సీక్వెల్‌లో మరింత పదును పెట్టినట్లు విమర్శకులు చెబుతున్నారు. కొన్ని సన్నివేశాలు, నేపథ్య సంగీత వినియోగం, సంభాషణల రూపకల్పన ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లుగా ఉన్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే కారణంగా ఈ సినిమా సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే చర్చ కూడా మొదలైంది. విడుదల ముందు న్యాయపరమైన అడ్డంకులు ఎదురైనప్పటికీ, కోర్టు అనుమతితో చిత్రం థియేటర్లలోకి వచ్చింది. విడుదల సమయం కూడా రంజాన్ మాసంతోౕాగ2?డటంతో విమర్శలు మరింత ఎక్కువయ్యాయి. బాక్సాఫీస్ విషయానికి వస్తే, తొలి రోజు సుమారు 75 లక్షల రూపాయల వసూళ్లతో ప్రారంభమైన ఈ చిత్రం, రెండో రోజు నాటికి సుమారు 5 కోట్ల రూపాయల వరకు వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే మొదటి భాగం స్థాయిలో ప్రభావం చూపలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నటన కంటే సందేశానికే ప్రాధాన్యం ఇచ్చిన కారణంగా పాత్రల్లో లోతు తగ్గిందని, కథనం హెచ్చరికల రూపంలో సాగిందని రివ్యూలు సూచిస్తున్నాయి. ఒక వర్గం పట్ల అనుమానాలు కలిగేలా కథను తీర్చిదిద్దడం సమాజంలో విభజనకు దారి తీసే అవకాశముందనే చర్చలు కొనసాగుతున్నాయి. మొత్తంగా 'ది కేరళ స్టోరీ 2' బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనను అందుకుంటూ, మరోసారి వివాదాల మధ్య ముందుకు సాగుతోంది.

# వెస్టిండీస్ పై ఘన విజయం
## సెమీస్‌కి దూసుకెళ్లిన భారత్




**మార్చి1 ,మన వార్త :** టీ20 వరల్డ్ కప్ సూపర్–8లో భాగంగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుగుతున్న కీలకమైన డూ ఆర్ డై మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. భారత జట్టు ఓపెనర్ సంజూ శాంసన్ (97 నాటౌట్) అద్భుతమైన బ్యాటింగ్ తో ఘన విజయం సాధించింది. దీంతో 5 వికెట్ల తేడాతో గెలిచి నేరుగా సెమీస్ లోకి అడుగు పెట్టింది. మార్చ్ 5వ తేదీన ఇంగ్లాండ్ జట్టుతో సెమీఫైనల్ లో తలపడబోతుంది. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. అయితే టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ చేయాలని భారత్ నిర్ణయించడంతో.. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ జట్టు ఓపెనర్లు అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. 85 పరుగులు వద్ద కరేబియన్ జట్టు తొలి వికెట్ ను కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్ లో రోస్టన్ చేజ్ (40), షాయ్ హోప్ (32), రోవ్‌మన్ పావెల్ (34), జాసన్ హోల్డర్ (37), షిమ్రాన్ హెట్మేయర్ (27) రాణించడంతో విండీస్ 195 పరుగులు చేసింది. అనంతరం 196 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన భారత జట్టుకు ప్రారంభంలోనే బిగ్ షాక్ తగిలింది. 29 పరుగుల వద్ద అకేలే హోసెన్ వేసిన బంతికి టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ (10) ఆడిన భారీ షాట్ కి బాల్ బ్యాట్ కి ఎడ్జ్ తాకడంతో షిమ్రోన్ హెట్మేయర్ కి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ కు చేరుకున్నాడు. ఆ తర్వాత బ్యాటింగ్ కి వచ్చిన ఇషాన్ కిషన్ (10) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేక పోయాడు. 41 పరుగుల వద్ద జాసన్ హోల్డర్ బౌలింగ్ లో హెట్మేయర్ క్యాచ్ పట్టడంతో డగౌట్ కి వెళ్లిపోయాడు. దీంతో బ్యాటింగ్ కి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (18).. కాసేపు బ్యాట్ ఝులిపించినప్పటికీ, కేవలం 18 పరుగులు చేసిన తర్వాత షామర్ జోసెఫ్ బౌలింగ్ లో రూథర్‌ఫోర్డ్ కి క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. చివర్లో మిడిల్ ఆర్డర్ బ్యాటర్ తిలక్ వర్మ (15 బాల్స్ లోనే 4 ఫోర్లు, ఒక సిక్సుతో 27 పరుగులు) అద్భుతమైన బ్యాటింగ్ చేశాడు. జాసన్ హోల్డర్ బౌలింగ్ లో బిగ్ షాట్ ఆడబోయి షిమ్రాన్ హెట్మేయర్ కి క్యాచ్ ఇచ్చి మైదానం వీడాడు. అనంతరం బ్యాటింగ్ కు వచ్చిన హార్దిక్ పాండ్యా సైతం విండీస్ బౌలర్లపై దూకుడుగా బ్యాటింగ్ చేయగా, 19 ఓవర్ వేసిన షామర్ జోసెఫ్ బౌలింగ్ లో జాసన్ హోల్డర్ కి క్యాచ్ ఇచ్చి పాండ్యా (17) పెవిలియన్ బాట పట్టాడు. లాస్ట్ ఓవర్ లో ఫస్ట్ బాల్ కే సిక్సు కొట్టి మ్యాచ్ ని గెలిపించాడు సంజూ శాంసన్. వెస్టిండీస్ బౌలర్లలో జాసన్ హోల్డర్, షామర్ జోసెఫ్ తలో రెండు వికెట్లు తీసుకోగా, అకేలే హోసెన్ ఒక వికెట్ పడగొట్టాడు. మొత్తానికి హై ప్రెషర్ మ్యాచ్లో భారత్ ఘన విజయం సాధించి సెమీస్ కి భారత్ దూసుకెళ్లింది.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com